
రజనీకాంత్ అభిమానిని.. అందుకే కథ విననని చెప్పా:
8 లో..

తెలుగు దినపత్రిక RNI APTEL/1999/00110
# కబురు
KABURU TELUGU DAILY

ఇదండీ..కబురు..



సంపుటి : 22 సంచిక : 276 | శుక్రవారం సెప్టెంబర్ 13 2024 | ఎడిటర్: శివకుమార్ గౌడ్ | పేజీలు 8 | వెల-5

# ఏచూరి మృతిపై ప్రముఖుల దిగ్భ్రాంతి

- ఓ ధృవతార రాలిపోయిందని వ్యాఖ్య
- సీతారాం మరణం కలచివేసిందన్న చంద్రబాబు
- మమతా బెనర్జీ, పలువురు కేంద్రమంత్రుల



**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 12**

**సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసారు. దేశ రాజకీయాల్లో ఆయన పాత్రను కొనియాడుతూ.. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకొంటూ 'ఎక్స్'లో పోస్టులు పెట్టారు.**

ఏచూరి మరణం తనను తీవ్రంగా కలచివేసిందని ఏపీ సీఎం, తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు అన్నారు. భారత రాజకీయాల్లో ఆయన గౌరవస్థానం పొందారన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేసిన మేధావి అని కొనియాడారు. అట్టడుగు వర్గాల ప్రజలతో మంచి అనుబంధం ఉన్న నేత అన్నారు. విశాల దృక్పథంతో కూడిన రాజకీయ చర్చలు పార్టీకి అతీతంగా ఆయనకు గుర్తింపు తీసుకొచ్చాయని తెలిపారు. సీతారాం ఏచూరి మరణం పట్ల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన తనకు మంచి మిత్రుడు, ఆప్తుడన్నారు. ఇకపై ఏచూరితో సుదీర్ఘ చర్చలను కోల్పోతానంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఏచూరి మన దేశం పట్ల లోతైన అవగాహన ఉన్న నేత 'ఐడియా ఆఫ్ ఇండియా'కు రక్షకుడిగా పేర్కొన్నారు. ఈ విషాద సమయంలో ఏచూరి కుటుంబ సభ్యులు, స్నేహితులు, అనుచరులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏచూరి మరణం పట్ల బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఒక ప్రముఖ పార్లమెంటేరియన్ అని.. అలాంటి గొప్ప నేత మరణం జాతీయ రాజకీయాలకు తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబానికి, స్నేహితులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏచూరి మరణం దిగ్భ్రాంతిని కలిగించింది. ఆయన మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు. ఏచూరి నిష్ణాతుడైన రాజకీయవేత్త, ఆలోచనాపరుడు. ప్రజా ప్రయోజనాల కోసం ఆయన పునరంకితమయ్యారని జార్ఖండ్ సిఎం హేమంత్ సోరెన్ అన్నారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం తీవ్ర విషాదం నింపింది. ప్రజా పోరాట యోధుడిని కోల్పోయాం. ప్రజా ఉద్యమాలకే జీవితం అంకితం చేసిన వారికి కన్నీటి నివాళులు అర్పిస్తున్నాను. అమర్ రహే కామ్రేడ్ సీతారాం ఏచూరి అని నారా లోకేశ్ సంతాపం తెలిపారు. సీపీఎం అగ్రనేత ఏచూరి మరణం పట్ల కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, కిరణ్ రిజుజు తీవ్ర సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఏచూరి మరణం నన్ను కలచివేసింది. ఆయన నాకు మంచి మిత్రుడు. నికార్సయిన కమ్యూనిస్టు యోధుడు. విద్యార్థి ఉద్యమాల్లో చురకైన పాత్ర పోషించిన ఏచూరి.. దేశ ప్రజల సమస్యలపై రాజీలేని పోరాటం చేశారు. గొప్ప వక్త. వామపక్ష ఉద్యమాలకు దిక్సూచి. ఏచూరి మరణం దేశ రాజకీయాలకు తీరని లోటు. నేటి తరం నేతలు ఆయన పంథాను ఆదర్శంగా తీసుకొని అంతరాల్లేని సమాజం కోసం కృషి చేయడయే నిజమైన నివాళని ప్రముఖ విద్యావేత్త చుక్కా రామయ్య అన్నారు. సీతారాం ఏచూరి ప్రజల తరఫున బలమైన గొంతుకగా పనిచేశారు. ఆయన మరణం దేశానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ అన్నారు. ఏచూరి అంటే ఒక వ్యక్తి కాదు.. శక్తి. దేశంలోని అగ్ర నాయకుల్లో ఒకరైన ఆయన అందరితోనూ ఆప్యాయంగా మెలిగేవారు. పార్లమెంటులో ఆయన ప్రసంగిస్తుంటే.. అందరూ ఆసక్తిగా వినేవారు. సభ్యులు ఆ అంశాలను నోట్ చేసుకొనేవారు. మతోన్మాద శక్తులను ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలను ఏకతాటిపైకి తీసుకొచ్చారు. ఆయన ఆశయ సాధనలో నడవాలని సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు.

## రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదు

**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 12**



రైతులు ఆత్మహత్య చేసుకుంటున్నా ప్రభుత్వం పట్టించుకోవట్లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. రుణమాఫీ కాలేదని కొందరు రైతులు ప్రాణాలు వదులుకోవడం ఆందోళనకరమన్నారు. పెట్టుబడి సాయం లేక మరికొందరు ప్రాణాలు వదిలారని చెప్పారు. కేసీఆర్ రైతును రాజు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం వారి ప్రాణాలు తీస్తోందన్నారు. రుణమాఫీ, రైతు భరోసా బోగస్ అని పేర్కొన్నారు. డిసెంబర్‌లో పెట్టిన డెడ్‌లైన్ సెప్టెంబర్ దాటినా అమలు కాకపోతే దగాపడ్డ అన్నదాతలు ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి దిల్లీ యాత్రలు చేయడం కాదు.. రాష్ట్రంలో ఏం జరుగుతుందో చూడాలని డిమాండ్ చేశారు. ఎవరూ ఆత్మహత్యలు చేసుకోవద్దని.. ధైర్యంగా ఉండాలని కేటీఆర్ సూచించారు.

## 17న ప్రజాపాలన దినోత్సవం

- పబ్లిక్ గార్డెన్‌లో జెండా ఆవిష్కరించనున్న సిఎం
- ఏర్పాట్లను సమీక్షించిన సిఎస్ శాంతికుమారి



2 లో

**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 12**

తెలంగాణ విమోచన దినం..సందర్భంగా ఈనెల 17వ తేదీన నిర్వహించే ప్రజా పాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి ఉదయం హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్ లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లపై అధికారులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి సమీక్షించారు. ప్రజా పాలన దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై డా. బీ.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉన్నత స్థాయి అధికారుల సమావేశాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నిర్వహించారు.

## 'ప్రజాపాలన' వేడుకలపై సీఎస్ సమీక్ష



2 లో

హైదరాబాద్‌లోని పబ్లిక్ గార్డెన్స్‌లో ఈ నెల 17న ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రస్థాయి వేడుకలను నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్) శాంతికుమారి తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారన్నారు. ప్రజాపాలన దినోత్సవ నిర్వహణ ఏర్పాట్లపై గురువారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సీఎస్ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. 17న ఉదయం అమరవీరుల స్తూపం వద్ద అమరులకు సీఎం నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించే కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.

## హైదరాబాద్ సీపీ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత

- పోలీసులతో బిఆర్ఎస్ నేతల వాగ్వాదం
- సిపికి ఫిర్యాదు చేసేందుకు వచ్చామన్న హరీష్ రావు
- దాడికి సిఎం రేవంత్‌దే బాధ్యతని విమర్శలు



**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 12**

హైదరాబాద్ సీపీ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత చోటు చేసుకుంది.సీపీ ఆఫీస్ కు వెళ్లిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తన ఇంటిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూసైబరాబాద్ సీపీ ఆఫీస్ లో పాడి కౌశిక్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన అక్కడ ఉన్న పోలీసులతో దురుసుగా ప్రవర్తించారు. వారిని నిలదీసేలా మాట్లాడారు.

# కౌశిక్ రెడ్డి..గాంధీల మధ్య సవాళ్ల ప్రతిసవాళ్లు




- ఇద్దరి ఇంటి వద్దా భారీ బందోబస్తు ఏర్పాటు
- తన ఇంటికి వస్తానని రానందుకు గాంధీ విమర్శలు
- అనుచరులతో కలసి నేరుగా పాడి ఇంటికి గాంధీ
- ఇరువర్గాల మొహరింపుతో ఉద్రిక్తత

**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 12**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి.. కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యే అరికపూడి గాంధీ మధ్య సవాళ్లు, ప్రతిసవాళ్ల వ్యవహారం రాజకీయంగా రచ్చకు దారితీసింది. నగరంలోని మాదాపూర్‌లో ఉన్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి అరికపూడి గాంధీ తన అనుచరులను వెంటబెట్టుకొని వెళ్లారు. దీంతో అక్కడ రచ్చరచ్చ జరిగింది. కౌశిక్ ఇంట్లోకి వెళ్లేందుకు అనుమతివ్వాలంటూ గాంధీ అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులను తోసుకొని లోపలకు వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో ఇరు పార్టీల నేతలు, కార్యకర్తలు పరస్పరం దాడులు చేసుకున్నారు. కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ నేతలపై కోడిగుడ్లు, టమాటాలు విసిరినట్టుగా తెలుస్తోంది. ఆయన ఇంటి అద్దాలు కూడా పగిలినట్టుగా సమాచారం. ఊహించని పరిణామంతో అక్కడ బీతావాహ పరిస్థితి నెలకొంది.కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలి రావడంతో నియంత్రించడం పోలీసులకు కూడా కాస్త కష్టంగా మారింది.

మిగతాద్ది 2 లో

# హైదరాబాద్ బ్రాండ్‌కు విఘాతం

- రేవంత్ తీరుతో నగరానికి చెడ్డ పేరు
- కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి దుర్మార్గపు చర్య
- మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు



2 లో

**కబురు న్యూస్, హైదరాబాద్ సెప్టెంబర్ 12**

బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లతో గ్రేటర్ హైదరాబాద్‌లో ఒక్కసారిగా పొలిటికల్ హీట్ పెరిగిపోయింది. దమ్ముంటే కాస్కో అని ఒకరు అంటే.. తేల్చుకుందాం రా అని ఇంకొకరు అనడంతో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ మాటల తూటాలతో ఇద్దరి వ్యక్తుల మధ్య నెలకొన్ని ఈ రచ్చ బీఆర్ఎస్ వర్సెస్ కాంగ్రెస్ పార్టీల మధ్య గొడవగా మారిపోయింది.

కబురు
KABURU TELUGU DAILY
శుక్రవారం సెప్టెంబర్ 13 2024

# సంపాదకీయం

## బద్ధకం వదిలేద్దాం!

ఆరోగ్యమే మహాభాగ్యమంటాం. ఆరోగ్యంగా ఉండేందుకు కనీసపాటి శ్రమైనా చేస్తున్నామా? శారీరక శ్రమ, క్రమం తప్పని కదలికల వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని తెలిసినా, భారతీయులు బద్ధకపు జీవనశైలినే అనుసరిస్తున్నారట. క్రియాశీలక జీవనవిధానానికి సంబంధించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కొన్ని మార్గదర్శకాలు పేర్కొంది. కానీ, మన దేశం నుంచి 20 కోట్ల మంది (15.5 కోట్ల మంది వయోజనులు, 4.5 కోట్ల మంది కౌమార వయస్కులు) వాటిని పాటించడంలో విఫలమవుతున్నారు. డాల్‌బెర్గ్ వారి 'స్టేట్ ఆఫ్ స్పోర్ట్స్ అండ్ ఫిజికల్ యాక్టివిటీ' (సాపా) నివేదిక తాజాగా ఈ సంగతి వెల్లడించింది. ఈ నివేదిక ఆందోళన కలిగించడమే కాక, ఆటలు, వ్యాయామం విషయంలో భారతీయులు శ్రద్ధ పెట్టాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తోంది.నిజానికి, ఇలాంటి జాతీయ స్థాయి సర్వే జరగడం ఇదే తొలిసారి. మేధావుల బృందమైన 'డాల్ బెర్గ్ అడ్వైజర్స్', స్వచ్ఛంద సంస్థ 'స్పోర్ట్స్ అండ్ సొసైటీ యాక్సలరేటర్' సంయుక్తంగా జరిపిన ఈ అధ్యయనం అనేక ఆందోళనకరమైన ధోరణులను వెల్లడించింది. మన దేశంలో వయోజనుల్లోని కాస్తంత పెద్దవారిలో 48 శాతం మంది ఆటల లాంటి శారీరక శ్రమ చేసేందుకు తమ వయసు మీద పడింది అనేస్తున్నారట. ఇంకా చిత్రం ఆటలు ఆడపిల్లలకు సురక్షితం కాదన్న అభిప్రాయంలో 45 శాతం మంది ఉన్నారట. అలాగే, శారీరక శ్రమ చేయడం ఋతుస్రావ మహిళలకు నష్టదాయకమనీ, ఒంటికి దెబ్బలు తగిలితే వివాహ అవకాశాలు దెబ్బ తింటాయనీ, భౌతిక శ్రమ వల్ల పెళ్ళయిన అమ్మాయిలకు గర్భస్రావం అవుతుందనీ... ఇలా రకరకాల దురభిప్రాయాలు నెలకొన్నాయి. గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లో... అలాగే పురుషులతో పోలిస్తే మహిళల్లో శారీరక శ్రమ బాగా తక్కువవడం గమనార్హం. దీనికి కారణాలు లేకపోలేదు. శారీరక శ్రమ చేసేందుకు అనుకూలంగా ఉద్యానాలు, మైదానాల లాంటి బహిరంగ ప్రదేశాలు పట్టణాల్లో కరవై పోయాయి.అందువల్ల గ్రామాలతో పోల్చి చూసినప్పుడు పట్టణాల్లో శారీరక శ్రమ రాహిత్యం రెట్టింపు ఉంటోంది. నగర జనాభా మరీ అతి సున్నితంగా తయారైంది. ఇక, మన భారతీయ మహిళల్లో... నూటికి 75 మందికి రకరకాల ఇంటిపనుల్లోనే సమయమంతా గడిచిపోతుంది.ఫలితంగా వారికి వ్యాయామం చేసేందుకు తీరిక దొరకని పరిస్థితి. ఈ కారణాలన్నీ కలిసి కొంప ముంచుతున్నాయి. జీవనశైలి వ్యాధులకు దారి తీస్తున్నాయి. చాలామంది రోజూ నడుస్తున్నామంటారు. నడక వల్ల ప్రయోజనాలు ఉన్నాయి కానీ, ఆరోగ్యవంతమైన శరీరానికి అదొక్కటే సరిపోదని నిపుణుల ఉవాచ. తాజా సర్వే ఒక్కటే కాదు... ప్రతిష్ఠాత్మక 'లాన్సెట్' పత్రికలో ఇటీవలే ప్రచురితమైన మరో అధ్యయనం సైతం భారతీయ వయోజనుల్లో నూటికి 50 మంది శారీరకంగా తగినంత శ్రమ చేయట్లేదని పేర్కొంది. అంతంత మాత్రపు శారీరక శ్రమతోనే వయోజనులు సరిపెట్టుకొంటున్న ధోరణి ఉన్నతాదాయాలుండే ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రధానంగా కనిపిస్తోంది. ఆ తరువాత రెండోస్థానంలో దక్షిణాసియా ప్రాంతం నిలిచింది.ఇది ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) సహా పలువురు అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం చెబుతున్న మాట. ఆందోళనకరమైన అంశం ఏమిటంటే... మన దేశంలోని వయోజనుల (కనీసం 18 ఏళ్ళు, ఆపైన ఉన్నవారి)లో పెద్దగా శారీరక శ్రమ చేయని సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. 2000 నాటికి అలాంటివారు 22 శాతం పైచిలుకు ఉంటే, 2010 నాటికి వారు 34 శాతం దాకా పెరిగారు. 2022 నాటికి 50 ఓాతం దాకా చేరారు. ఇలాగే కొనసాగితే... 2030 నాటికల్లా ఇలాంటివాళ్ళు ఏకంగా 60 శాతానికి చేరతారని అంచనా. ఇది శారీరక, మానసిక ఆరోగ్యపరంగానే కాదు... సామాజికంగానూ ప్రమాదఘంటికే! రోజూ బద్ధకంగా, శారీరక శ్రమ లేకుండా గడిపేస్తుంటే... మధుమేహం, గుండెజబ్బు వచ్చే ముప్పుంది. నిజానికి, ఎంతసేపూ కదలకుండా కూర్చొనే జీవనశైలి, శారీరక శ్రమ అంతకంతకూ తగ్గిపోవడం వల్ల ప్రపంచమంతటా ఈ జబ్బుల బారినపడుతున్నవారు పెరుగుతున్నారు. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలపై భారం పడుతోందని డబ్ల్యూహెచ్ఓ మాట. అంతేకాదు... ఈ బద్ధకపు జీవన విధానం వల్ల మన దేశంలో దాదాపు 25.4 కోట్లమందికి పైగా స్థూలకాయంతో, 18.5 కోట్ల మంది దాకా 'చెడు కొలెస్ట్రాల్'తో బాధపడుతున్నట్టు వెల్లడైంది. ఆరోగ్యానికే కాదు... దేశ ఆర్థిక బలిమికీ శారీరకంగా చురుకుదనం అత్యంత కీలకం. మన దేశ జనాభా మొత్తం శ్రమకు నడుంబిగిస్తే, 2047 నాటికి దేశ స్థూల జాతీయోత్పత్తి రూ. 15 ట్రిలియన్లు దాటిపోతుందని అంచనా. స్థూలకాయం, లాంటి జబ్బులు తగ్గడమే కాదు, వాటి కోసం ఖర్చు చేస్తున్న రూ. 30 ట్రిలియన్లు ఆదా అవుతాయి. లెక్కతీస్తే, ప్రపంచ జనాభాలో మూడింట ఒక వంతు మంది తగిన శారీరక శ్రమ చేయక చెరుపు చేస్తున్నారు, చేసుకుంటున్నారు. ఇక, డబ్ల్యూహెచ్ఓ ప్రమాణాల్ని బట్టి చూసినా శారీరక శ్రమరాహిత్యం అత్యధికంగా ఉన్న 195 దేశాల్లో భారత్ 12వ స్థానంలో నిలిచిందని 'లాన్సెట్' అధ్యయనం.

రోజువారీ వ్యాయామంతో సమయం వృథా అనీ, ర్యాంకుల చదువులతోనే జీవితంలో పైకి వస్తామనీ, ఆటలు అందుకు ఆటంకమనీ భావించే తల్లితండ్రుల ఆలోచనా ధోరణి ఇకనైనా మారాల్సి ఉంది. మనమైనా, మన దేశమైనా పైకి రావాలంటే... మనుషుల శారీరక, మానసిక ఆరోగ్యమే కీలకం. ప్రభుత్వాలు అది గుర్తించి ఆటలతో మేళవించిన విద్యా ప్రణాళికను తప్పనిసరి చేయాలి. పౌరుల కోసం వ్యాయామ కేంద్రాల వసతులూ పెంచాలి. ఎందుకంటే, జీవన సౌంద ర్యమే కాదు... జగమంతటినీ లక్ష్మీనివాసంగా మార్చే మహత్తూ శ్రమశక్తిదే మరి!

# కౌశిక్ రెడ్డి..గాంధీల మధ్య సవాళ్ల ప్రతిసవాళ్లు

మొదటిపేజీ తరువాయి

అయినప్పటికీ పోలీసులు అరికపూడి గాంధీని అదుపులోకి తీసుకున్నారు. ఆయనను ఇంటికి తరలించారు. పాడి కౌశిక్ రెడ్డి తన ఇంటికి వస్తానని రాలేదు కాబట్టే తాను ఆయన ఇంటికి వెళ్లానని గాంధీ అన్నారు. నా ఇంటికి నువ్వు రాలేకపోయావ్.. నేనే మీ ఇంటికి వచ్చా. కౌశిక్ రెడ్డి ఒక బ్రోకర్. కౌశిక్ రెడ్డి వచ్చాక బీఆర్ఎస్ నాశనమైంది. అతడి వల్లే పార్టీ ఓడిపోయిందని అన్నారు. తన ఇంటిపై ఎమ్మెల్యే అరికపూడి గాంధీ అనుచరులు దాడికి పాల్పడిన ఘటనపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. గాంధీ తన రౌడీలను తీసుకొని నా ఇంటి మీదకు వచ్చాడు. నాపై హత్యాయత్నం చేశారు. పోలీసులే దగ్గరుండి దాడి చేయించారు. ఈ చర్యకు కచ్చితంగా ప్రతిచర్య ఉంటుంది. రేపు ఏం జరుగుతుందో మీరు చూస్తారు. రేపు కచ్చితంగా అరికపూడి గాంధీ ఇంటికి వెళ్లి తీరుతా' అని అన్నారు. దాడి ఘటనకు ముందు కౌశిక్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూఅరికపూడి గాంధీపై మండిపడ్డారు. 'బ్రోకర్‌వి నువ్వా నేనా.. టీడీపీలో గెలిచి బాబును మోసం చేశావు.. బీఆర్ఎస్‌లో గెలిచి కేసీఆర్‌ను మోసం చేశావు' అని నిందించారు. 'మిస్టర్ గాంధీ గుర్తు పెట్టుకో.. సీఎం అవుతానని చెప్పుకున్న ఈటెలను బొంద పెట్టిన మగాణ్ణి నేను.. తెలంగాణ గడ్డ మీద పుట్టిన బిడ్డను అంటూ హెచ్చరికలు జారీ చేశారు. 'ఎక్కడ నుంచో వచ్చి నాకు సవాల్ చేస్తే ఊరుకుంటానా?' అంటూ కౌశిక్ రెడ్డి మండిపడ్డారు. రేపు ఉదయం 11గంటలకు మా మేడ్చల్ జిల్లా అధ్యక్షుని నాయకత్వంలో గాంధీ ఇంటికి వెళతామని కౌశిక్ రెడ్డి తెలిపారు. జిల్లా బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అంతా రావాలని పిలుపునిస్తున్నానన్నారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు అనుమతితో చెబుతున్నానన్నారు. 'నీకు నాకు ఏమైనా తగాదాలు ఉన్నాయా? నీకు నాకు ఏం పంచాయితీ? బీఆర్ఎస్ బి ఫామ్ మీద గెలిచి కాంగ్రెస్ లోకి వెళ్లడానికి సిగ్గు అనిపించడం లేదా?' అని ప్రశ్నించారు. మగాడివి ఐతే రాజీనామా చేసి మళ్లీ గెలువాలంటూ కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు. అక్కడే మీ బలం, మా బలం ఏంటో తేల్చుకుందామన్నారు. అప్పుడు మొనగాడివి అని ఒప్పుకుంటానని కౌశిక్ రెడ్డి అన్నారు. బీఆర్ఎస్‌లో ఉంటే తెలంగాణ భవన్‌కు రావాలంటూ పాడి కౌశిక్ రెడ్డి సవాల్ విసిరారు. గాంధీ ఇంటికి బయలుదేరుతా అనగానే తన ఇంటి చుట్టూ కంచెలు వేశారని కౌశిక్ రెడ్డి విమర్శించారు. తనను ముందస్తుగా అరెస్ట్ చేశారన్నారు. బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పుడు తాను కూడా గాంధీకి సహచర ఎమ్మెల్యేనేనని అన్నారు. ఇద్దరం ఒకే పార్టీలో ఉంటే ఇద్దరం కలిసి బీఆర్ఎస్ భవన్‌కు వెళతామన్నానని.. దానికి గాంధీ ఎందుకు ఉలిక్కిపడుతున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ మారనప్పుడు బీఆర్ఎస్ పార్టీ జెండా పెట్టుకోవడానికి ఎందుకు అభ్యంతరం అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీలో చేరానన్నది మీరే కదా? అని ప్రశ్నించారు. అలాంటప్పుడు మీకెందుకు అంత భయం అవుతుందని నిలదీశారు. ఎప్పుడూ కేసీఆర్ వ్యక్తిగతగా ఏ ఎమ్మెల్యేలకు కండువాలు కప్పలేదని అలా నిరూపిస్తే రాజీనామా చేస్తానని అన్నారు. మరోవైపు అరికెపూడి గాంధీపై కూడా కౌశిక్ రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. గాంధీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అయితే తెలంగాణ భవన్‌కు రావాలని సవాల్ చేశారు. లేకుంటే తానే గాంధీ ఇంటికి వెళ్లి గులాబీ జెండా ఆయన ఇంటిపై ఎగరేసి వస్తానని అన్నారు. అనంతరం తెలంగాణ భవన్‌లో ప్రెస్‌మీట్ పెడతానంటూ సవాల్ చేశారు. సవాల్ నేపథ్యంలో కౌశిక్ రెడ్డిని పోలీసులు గృహనిర్బంధం చేశారు.పోలీసులు ఆయన్ని బయటకు రాకుండా కట్టడి చేస్తున్నారు. మరోవైపు కౌశిక్ రెడ్డి కామెంట్స్‌పై కాంగ్రెస్ మహిళా నేతలు ఫైర్ అయ్యారు. ఆయన చేసిన చీరా గాజుల విమర్శలపై కూడా తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. అసలు బీఆర్ఎస్ పుట్టుకే ఫిరాయింపులతో మొదలైందని అన్నారు. మహిళలను కించపరిచేలా కౌశిక్ రెడ్డి చేసిన కామెంట్స్‌ను మహిళా కమిషన్ సుమోటోగా తీసుకొని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై పోలీసులకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. ఇలాంటి మాటలు పదే పదే మాట్లాడితే మాత్రం కౌశిక్ రెడ్డికి కచ్చితంగా చెప్పుతో బుద్ధి చెబుతామన్నారు. ఆయన మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని అన్నారు. మరోవైపు అరికెపూడి గాంధీ నివాసం వద్ద కూడా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అరికెపూడి గాంధీ సైతం కౌశిక్ రెడ్డికి రివర్స్ సవాల్ విసిరారు. '11 గంటలకు వస్తా అన్నావు.. రాకుంటే నేను నీ ఇంటికి 12 గంటలకు వస్తా.. నీ దమ్ము ఏంటో మా దమ్ము ఏంటో తేల్చుకుందాం' అని అరేకపూడి గాంధీ ఛాలెంజ్ చేశారు. దీంతో ఇరువురి ఇంటి వద్దా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే తన ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు ఏమీ అవసరం లేదని అరికెపూడి గాంధీ అంటున్నారు.

# హైదరాబాద్ బ్రాండ్‌కు విఘాతం

మొదటిపేజీ తరువాయి

అక్కడితో ఆగని ఇరువురూ.. ఒకరిపై ఒకరు తిట్టిపోసుకున్నారు. కౌశిక్ ఓ బ్రోకర్ అని.. దమ్ముంటే బయటికి రా అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి మరీ సవాల్ చేశారు గాంధీ. కట్టర్ తెలంగాణ బిడ్డనంటూ కౌశిక్ కౌంటరిచ్చారు. ఈ క్రమంలోనే కౌశిక్ ఇంటిపై కార్యకర్తలు, అనుచరులు టమోటాలు, గుడ్లతో దాడికి తెగబడ్డారు. ఈ వ్యవహారంతో ఒక్కసారిగా ఇది కాస్త ఉద్రిక్తంగా మారింది. ఈ ఉద్రిక్తతల మధ్యే గాంధీని పోలీసులు అరెస్ట్ చేశారు. సరిగ్గా ఈ పరిస్థితుల్లోనే మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రంగంలోకి దిగారు. కౌశిక్‌ను పరామర్శించేందుకు ఆయన ఇంటికి హరీశ్ బయల్దేరి వెళ్లారు.' మీ చర్యల వల్ల హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పోయింది. మా బీఆర్ఎస్ హయాంలో ఎప్పుడైనా ఇలాంటి దాడులు జరిగాయా? గాంధీపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలి. దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి. దాడిపై సీఎం రేవంత్ రెడ్డి ఏం సమాధానం చెబుతారు?. ప్రజలకు రేవంత్ రెడ్డి ఇచ్చే సందేశం ఏంటన్నారు. ఖమ్మంలో మాపై దాడి చేస్తే ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదు. తెలంగాణలో లా అండ్ ఆర్డర్ ఉందా అని ప్రశ్నించారు. కౌశిక్‌రెడ్డి ఇంటిపైకి దాడికి వస్తున్నారని పోలీసులకు సమాచారం ఇచ్చాం. సమాచారం ఉన్నా పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోలేదు?. మీ చర్యల వల్ల హైదరాబాద్‌కు పెట్టుబడులు రావట్లేదు ' అని రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు కన్నెర్రజేశారు. రెచ్చగొట్టే చర్యలకు ప్రభుత్వం మద్దతు ఇస్తోందని మండిపడ్డారు.

# 17న ప్రజాపాలన దినోత్సవం

మొదటిపేజీ తరువాయి

ప్రజాపాలన దినోత్సవమైన 17వ తేదీన ఉదయం ముఖ్యమంత్రి అమరవీరుల స్తూపం వద్ద అమరులకు నివాళులు అర్పిస్తారని, అనంతరం పబ్లిక్ గార్డెన్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అక్కడ పోలీసు గౌరవ వందనం స్వీకరించిన అనంతరం ముఖ్యమంత్రి ప్రసంగం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను సి.ఎస్. ఆదేశించారు. సభా స్థలంలో మౌలిక సదుపాయాల కల్పన, ఆహ్వానితుల వాహనాలకు సరైన పార్కింగ్ సదుపాయం, శానిటేషన్, పీఏ సిస్టం, భద్రతా తదితర ఏర్పాట్లను చేపట్టాలని అన్నారు. 17న గణెశిష్ నిమజ్జనం ఉన్నందున ఈ సమావేశానికి హాజరయ్యే వారికి ట్రాఫిక్ నియంత్రణ, తగు మార్గాలను ముందస్తుగా తెలియచేయాలని నగర పోలీసు అధికారులకు సూచించారు. నగరంలోని అన్ని ప్రధాన కార్యాలయాలు, పర్యాటక భవనాలను విద్యుత్ దీపాలతో అలంకరించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సి.వీ ఆనంద్, ఇంటలిజెన్స్ అడిషనల్ డీజీ శివధర్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, హోమ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవీ గుప్తా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణి ప్రసాద్, ్ర÷ర్ సర్వీసులు డీజీ నాగి రెడ్డి, జీఏడీ కార్యదర్శి రఘునందన్ రావు, జీహెచ్ ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, సమాచార శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ సీపీ ఆఫీస్ వద్ద ఉద్రిక్తత

మొదటిపేజీ తరువాయి

కౌశిక్ రెడ్డితోపాటు హరీశ్ రావు, భారీగా బిఆర్ఎస్ నాయకులు సీపీ ఆఫీస్ కు వెళ్లారు. దీంతో హరీష్ రావుతో పాటు బీఆర్ఎస్ నాయకులను సైబరాబాద్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో గులాబీ నేతలకు పోలీసులకు మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని.. ఏసీపీ,సీఐను సస్పెండ్ చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగరంలో పట్టపగలు ఎమ్మెల్యే ఇంటిపై దాడి జరిగిందని.. బీఆర్ఎస్ కార్యకర్తలను గృహ నిర్భందం, అరెస్టులు చేశారని మాజీ మంత్రి హరీష్ రావు అసహనం వ్యక్తం చేశారు. పైలెట్, ఎస్కార్ట్ ఇచ్చి తమ ఎమ్మెల్యే ఇంటిపై కాంగ్రెస్ వాళ్ళను దాడికి పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిద్దిపేటలో తన క్యాంపు కార్యాలయంపైన కూడా దాడి జరిగిందని చెప్పారు. ఇటీవల ఖమ్మంలో వరద బాధితుల పరామర్శకు వెళ్తే కూడా తమపై దాడి చేశారని హరీశ్ రావు గుర్తు చేశారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అనుచరులు కొండాపూర్‌లోని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన విషయం తెలుసుకున్న హరీశ్ రావు.. సిద్దిపేట నుంచి కౌశిక్ రెడ్డి నివాసానికి బయలుదేరి వచ్చారు. కౌశిక్ రెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ ప్రోత్సాహంతోనే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి జరిగిందని హరీశ్ రావు ఆరోపించారు. రేవంత్ వెంటనే కౌశిక్ రెడ్డికి క్షమాపణ చెప్పాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లోకి అక్రమంగా చేర్చుకోవడంతో పాటు, వారినే తిరిగి ఉసిగొల్పి గులాబీ పార్టీ ఎమ్మెల్యేలపై దాడులు చేయించడం దుర్మార్గం అని హరీశ్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.'కాంగ్రెస్ పార్టీలో చేరాను అని ట్విట్టర్లో పెట్టి.. ఇవాళ పీఏసీ చైర్మన్ అవ్వగానే నేను ప్రతిపక్షంలో ఉన్నా అని కూడా సిగ్గులేకుండా మాట్లాడింది నువ్వు అరికెపూడి గాంధీ. డిఫెన్సులో పడి నీ ఇజ్జత్, మానం పోయిందని ఇయాల ప్రశ్నిస్తే మా కౌశిక్ రెడ్డి మీద దాడి చేసే ప్రయత్నం చేశారని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మా ఎమ్మెల్యేను హౌస్ అరెస్టు చేసి పోలీసులు ఏం చేస్తున్నారు? కౌశిక్ రెడ్డిపై దాడి రేవంత్ రెడ్డి చేయించారు. ఏసీపీ, సీఐను వెంటనే సస్పెండ్ చేయాలి. కేసీఆర్ హైదరాబాద్ నగరంలో శాంతిభద్రతలు కాపాడారు. పెట్టుబడులు స్వర్గధామంగా హైదరాబాద్ ను కేసీఆర్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పాయి. హైదరాబాద్ ప్రతిష్ట దెబ్బతింటుంది. హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కుదేలు అయింది. ఇది రేవంత్ రెడ్డి వైఫల్యం. రాష్ట్రాన్ని రేవంత్ రెడ్డి ఏం చేయదలు చుకున్నారు. రాష్ట్రంలో తొమ్మిది కమ్యూనల్ ఘటనలు చోటుచేసుకున్నాయి. తొమ్మిది నెలల్లో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అప్రతిష్టపాలు అయింది. మా సహనాన్ని చేతగానితనంగా భావించవద్దన్నారు. పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి విషయంలో స్పీకర్ స్పందించాలి. కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి. మాటల్లో ప్రజా పాలన...రాహుల్ గాంధీ చేతుల్లో రాజ్యాంగం. కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ అంటే ఇదేనా రాహుల్ గాంధీ. రేవంత్ రెడ్డిని రాహుల్ గాంధీ మందలిస్తారా లేదా చెప్పాలి. రాహుల్ గాంధీకి రాజ్యాంగంపై నమ్మకం ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించు. సైబరాబాద్ సీపీకి కౌశిక్ రెడ్డి ఫిర్యాదు చేస్తారు' అని హరీశ్ రావు మాట్లాడారు. నంతరం సైబరాబాద్ సీపీకి ఫిర్యాదు చేసేందుకు ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డిని వెంటబెట్టుకొని కొండాపూర్ నుంచి మాజీ మంత్రులు హరీష్ రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, సబితా ఇంద్రా రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు,

# 'ప్రజాపాలన' వేడుకలపై సీఎస్ సమీక్ష

మొదటిపేజీ తరువాయి

17న గణేశ్ నిమజ్జనం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి చర్యలు చేపట్టాలన్నారు. ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా అన్ని శాఖల ప్రధాన కార్యాలయాలు, పర్యాటక భవనాలను విద్యుద్దీపాలతో అలంకరించాలన్నారు. ఈ సమావేశంలో డీజీపీ జితేందర్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఇంటెలిజెన్స్ అడిషనల్ డీజీ శివధర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ శాఖ ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, హెూం శాఖ ముఖ్య కార్యదర్శి రవిగుప్తా, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, పర్యాటక, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, జీఏడీ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ అమ్రపాలి తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవాదిపై భౌతిక దాడిని ఖండించిన బార్

## నవతే జగన్ మోహన్ న్యాయవాదిగా అనర్హుడు..




కబురు న్యూస్,నిజామాబాద్ లీగల్,సెప్టెంబర్ 12 : నిజామాబాద్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి,న్యాయవాది వసంత్ రావు పై భౌతిక దాడి చేసిన జగన్ మోహన్ నవతే తీరును బార్ అత్యవసర సమావేశంలో పలువురు సీనియర్ న్యాయవాదులు తీవ్రంగా ఖండించారు.బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీనియర్ న్యాయవాదులు ఎర్రం గణపతి, శ్రీహరి ఆచార్య,పిట్లం శ్రీనివాస్,పరుచూరి శ్రీధర్,కృపాకర్ రెడ్డి తదితరులు మాట్లాడుతు,జిల్లాకోర్టు ప్రాంగణంలో న్యాయవాదిపై దాడిని న్యాయవాదులపై దాడిగా వారు అభివర్ణించారు. జగన్ మోహన్ నవతే న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయకుండా తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉత్తర్వులు ఉన్నాయని వారు తెలిపారు. అలాంటి వ్యక్తి కోర్టు పరిధిలో ఉండి చట్ట విరుద్ధంగా వ్యవహరించడం చాలా పెద్ద తప్పిదంగా వారు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు మంథని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జగన్మోహన్ నవతే వ్యవహార శైలిని బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకువెళతానని తెలిపారు. అనంతరం బార్ అధ్యక్షుడు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ జరిగిన సంఘటనపై ముగ్గురు సీనియర్ న్యాయవాదులతో ఒక కమిటీని నియమించామని,వారు నివేదికను సమర్పించగానే జగన్మోహన్ నవతే పై మరిన్ని కఠిన చర్యలు తీసుకునే విధంగా తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ కు పిర్యాదు చేస్తామని తెలిపారు.నిజామాబాద్ బార్ అసోసియేషన్ సభ్యత్వం నుండి సస్పెన్షన్ చేస్తు తదుపరి క్రమ శిక్షణ చర్యల కోసం ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు తెలిపారు. గత ఫిబ్రవరి నెల నుండి న్యాయవాదిగా ప్రాక్టీస్ చేయకుండా జగన్మోహన్ నవతే పై ఉత్తర్వులు ఉన్నాయని వీటిని కక్షిదారులు గమనించాలని కోరారు.అతను కోర్టు ఆవరణలో బాధ్యతాయుతమైన బార్ ప్రధాన కార్యదర్శి వసంత్ రావుపై దాడి చేసి గాయ పర్చడం,కులం పేరుతో దూషించడం,అవమానించడం తీవ్రంగా పరిగణనలోకి తీసుకుని తదుపరి చర్యలకు సన్నద్ధం అవుతున్నట్లు జగన్ మోహన్ గౌడ్ తెలిపారు.

## గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆసుపత్రి సూపరిండెంట్



కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 12
బాన్సువాడ పట్టణంలోని మాతా శిశు ఆసుపత్రి ఆవరణలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఆసుపత్రి సూపర్డెంట్ విజయలక్ష్మి గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఐదు రోజులు పూజలు అందుకున్న గణనాధుని బుధవారం రాత్రి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపర్డెంట్ విజయలక్ష్మి, వైద్యులు విజయభాస్కర్, ఆర్ ఎం ఓ సుజాత, వైద్య సిబ్బంది లక్ష్మణ్, చందు, సాయిబాబా నవీన్, సురేందర్ ,రాజ్ కుమార్ ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## మందకృష్ణ మాదిగకు పాలాభిషేకం చేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 12
ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడంలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చేసిన కృషి ఎనలేనిదని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు బాలరాజ్ అన్నారు. బుధవారం బాన్సువాడ మండలంలోని బోర్లం గ్రామంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సాయికుమార్, సాయిలు దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, పర్వారెడ్డి, రమేష్, దత్తు, శేఖర్, సంగయ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్ కాసుల



కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 12
నసురుల్లాబాద్ మండలంలోని దూర్కి గ్రామంలో గణేష్ మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలకు బుధవారం రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజ్ హాజరై గణనాధునికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గణేష్ మండలి సభ్యులు కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దుర్గం శ్యామల, మోహన్, ప్రకాష్, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ ను ముందస్తు అరెస్టు చేసిన పోలీసులు

కబురు న్యూస్ బాన్సువాడ సెప్టెంబర్ 12
హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఇంటిపై శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ అనుచరులు చేసిన దాడికి నిరసనగా మాజీమంత్రి సిద్దిపేట్ ఎమ్మెల్యే హరీష్ రావు ఇచ్చిన పిలుపుమేరకు బిఆర్ఎస్ నాయకులు




హైదరాబాదు వెళ్తున్నారని ముందస్తు సమాచారం మేరకు బాన్సువాడ పట్టణంలోని బిఆర్ఎస్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ జుబేర్ ను పోలీసులు ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు

# వైద్యారోగ్య శాఖ పనితీరులో స్పష్టమైన మార్పు కనిపించాలి







- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు...
- వైద్యుల హాజరును నిరంతరం పర్యవేక్షించాలని డీఎంహెచ్ఓకు ఆదేశం..

కబురు న్యూస్,మోపాల్, సెప్టెంబర్ 12 : వైద్యారోగ్య శాఖ పనితీరును మరింతగా పటిష్టపర్చి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సంబంధిత అధికారులకు సూచించారు.మోపాల్ మండలం ముదక్ పల్లిలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని ఆయా విభాగాలను, ఔషధాలు నిలువ ఉంచిన స్టోర్ రూమ్, రోగుల ఇన్ పేషంట్ వార్డు, ల్యాబ్ తదితర వాటిని సందర్శించి, రిజిస్టర్లను పరిశీలించారు.వైద్యులు,సిబ్బంది గురించి ఆరా తీయగా,పలువురు అందుబాటులో లేకపోవడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవల గురించి రోగులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముదక్ పల్లి పీ.హెచ్.సీ పరిధిలో డెంగ్యూ కేసులు నమోదవుతుండడాన్ని గమనించి, అందుకు గల కారణాలు ఏమిటని వైద్య సిబ్బందిని ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని జిల్లా వ్యాప్తంగా గల అన్ని పీ.హెచ్.సీలు, ఆసుపత్రులలో వైద్యులు, సిబ్బంది అందరూ సకాలంలో విధులకు హాజరయ్యేలా చూడాలని, ప్రతిరోజూ ఉదయం వేళలోనే అటెండెన్స్ ను పర్యవేక్షించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖలో స్పష్టమైన మార్పు కనిపించాలని, క్షేత్ర స్థాయిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును గాడిలో పెట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. అన్ని ఆసుపత్రులు, పీ.హెచ్.సీల వైద్యులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు అందుబాటులో ఉంటూ అంకిత భావంతో వైద్యసేవలు అందించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరపాలన్నారు.ఎక్కడైనా పీ.హెచ్.సీలో వైద్యాధికారి సెలవులో



ఉంటే,ఇతర ఆసుపత్రుల నుండి ప్రత్యామ్నాయంగా వైద్యులను సర్దుబాటు చేయాలని సూచించారు.ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలకు వైద్య సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యానికి తావుండకూడదని అన్నారు.వర్షాకాలం సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున వైద్యులు,సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉంటూ వైద్య సేవలు అందించాలని సూచించారు.పాము కాటు,కుక్కకాటు మందులతో పాటు అన్ని అత్యవసర మందులను అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు.

# పామును పట్టడానికి వెళ్లి.. ప్రాణాలు కోల్పోయాడు

కబురు న్యూస్,ఎడపల్లి,సెప్టెంబర్ 12 : పామును పట్టడానికి వెళ్లి ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన ఘటన నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలో చోటుచేసుకుంది.మండలంలోని ఓ ఇంట్లోకి పాము రావడంతో నారాయణ(61)కు సమాచారం అందించారు.పామును పట్టుకున్న నారాయణ దాన్ని సంచిలో వేసుకుని వెళ్తుండగా,సంచికి ఉన్న రంధ్రం నుంచి అతడిని కాటువేసినట్లు స్థానికులు



తెలిపారు.చికిత్స నిమిత్తం అతడిని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

# కాంగ్రెస్ నాయకుడిని పరామర్శించిన పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి

**- కార్యకర్తలపై జరిగిన దాడులపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్తా... పార్టీ ఇన్చార్జి ఏనుగు**





**కబురు న్యూస్ సెప్టెంబర్ 12**
బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీలోకి బిఆర్ఎస్ నుండి చేరిన ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి అనుచరులు చేస్తున్న అరాచకాలను, కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలపై చేస్తున్న దాడుల విషయమై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకు వెళ్తానని పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి అన్నారు. గురువారం వర్ని మండలంలోని వడ్డేపల్లి గ్రామానికి చెందిన భీమశంకర్ కాంగ్రెస్ నాయకునిపై బిఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు చేసిన దాడిని ఆయన ఖండించారు. 35 ఏండ్లుగా పార్టీ కోసం జెండా మోసి కష్టపడుతున్న పార్టీ కార్యకర్తలపై ఇటీవలే చేరిన నాయకులు ఇక తమదే రాజ్యం అంటూ పార్టీ కార్యకర్తలపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. దాడులపై ఎంత పెద్ద నాయకులు ఉన్న వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, నాయకుడు భీమశంకర్ కు తగిన న్యాయం చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్యకర్తలకు అండగా ఉంటానని ఎవరు అధైర్యపడవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, మాసాని శ్రీనివాస్ రెడ్డి,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాత బాలకృష్ణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అదృశ్యమైన వృద్ధుడి ఆచూకీ లభ్యం



**కబురు న్యూస్,నిజామాబాద్ టౌన్,సెప్టెంబర్ 12 :**
నిజామాబాద్ జిల్లా కేంద్రంలో అదృశ్యమైన కృష్ణమూర్తి 72 వృద్ధుడి ఆచూకీ లభ్యం అయినట్లు రైల్వే ఎస్ఐ సాయి రెడ్డి గురువారం తెలిపారు. అయితే ఈనెల 8వ తేదీన భీమవరం రైల్వే స్టేషన్లో షిరిడి వెళ్దామని కృష్ణమూర్తి తన కుటుంబ సభ్యులతో కలిసి నాగర్సోల్ ఎక్స్ప్రెస్ రైల్వే ఎక్కాడు. అయితే నిజామాబాదు వచ్చిన ట్రైన్ లోంచి సదరు వృద్ధుడు దిగి వెళ్ళాడు. దీంతో కుటుంబ సభ్యులు 9వ తేదీన నిజామాబాద్ రైల్వే స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన రైల్వే ఎస్సై సాయి సాయి రెడ్డి సీసీ కెమెరాలు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. నగరాన్ని పూర్తిగా జల్లాడ పట్టగా, పాలిటెక్నిక్ ప్రాంతంలో వృదుడిని గురువారం సాయంత్రం గుర్తించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు కృష్ణమూర్తిని అప్పగించారు. పోలీసులు కేసు చేసిన కృషికి, కృష్ణమూర్తి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## కులాస్పూరులో చిరుత పులుల సంచారం



**కబురు న్యూస్,మోపాల్,సెప్టెంబర్ 12 :**
నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం కులస్పూర్ అటవీ ప్రాంతంలో నాలుగు చిరుతలు సంచరిస్తున్నట్లు పశువుల కాపరులు,గొర్ల కాపరులు తెలిపారు.గత కొద్దిరోజులుగా ఏడు మేకలను చిరుతపులులు ఎత్తుకెళ్లి చంపినట్లు తెలిపారు.ఈ విషయమై గురువారం అటవీ అధికారులకు సమాచారం అందించగా కులాస్పూర్ గ్రామాన్ని పరిశీలించారు.దట్టమైన అటవీ ఉండటంతో వన్యప్రాణులు ఉన్నాయని అధికారులు తెలిపారు.గతంలో కూడా ఈ ప్రాంతంలో చిరుతపుల సంచారం ఉనికినీ కనుగొన్నమని అధికారులు తెలిపారు.చిరుతల సంచారంతో గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, అటవీ ప్రాంతానికి వెళ్లేవారు మేకల గొర్ల కాపరులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. త్వరలోనే చిరుతలను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

# రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలపై భగ్గుమన్నబిజెపి శ్రేణులు...

**- తెలంగాణ చౌక్ లో బిజెపి శ్రేణుల భారీ ఆందోళన.. రాహుల్ గాంధీ దిష్టిబొమ్మ దహనం..**
**- దేశాన్ని కించపరిచేలా వ్యాఖ్యలు చేసే ప్రతిపక్ష కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ భారతీయుడా..?**
**- రాహుల్ గాంధీ వ్యవహార శైలి పై అంతర్జాతీయ మీడియాలో తలదించుకునేవిధంగాభారతీయుడా లేక ఇతర దేశస్తుడా అని న్యూస్ ఆర్టికల్స్ రాశాయి.**
**- దేశ ప్రతిష్టతను దిగజార్చిలా విదేశాల్లో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు..**
**- దేశాన్ని కించపరుస్తూ, దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ గాంధీ సమావేశాలు నిర్వహించడంలో ఆంతర్యం ఏమిటి..?**
**- రిజర్వేషన్లు రద్దు పై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను గమనించాలి.**
**- రిజర్వేషన్ల రద్దు కోసం రాహుల్ గాంధీ యే ఆరాటపడుతున్నారు.. ఈ అంశంలో బిజెపిని బదనాం చేసే ప్రయత్నం చేశారు...**
**- రిజర్వేషన్లు రాజ్యాంగం ఇచ్చిన హక్కు.. బిజెపి అధికారంలో ఉన్నన్నాళ్లు రిజర్వేషన్లకు డోకా లేదు..**
**- దేశ ప్రతిష్టను దెబ్బతీసేలా ఎవరు మాట్లాడిన ఊరుకునేది లేదు...**
**- బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి వ్యాఖ్యలు...**

**కరీంనగర్ సెప్టెంబర్ 12 కబురు న్యూస్ :**
కాంగ్రెస్ పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విదేశాల్లో పర్యటిస్తూ దేశాన్ని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడంపై, రిజర్వేషన్ల రద్దు పై మాట్లాడిన తీరు పై బిజెపి శ్రేణులు భగ్గుమన్నారు. ఈ మేరకు గురువారం రోజున కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో బిజెపి జిల్లా శాఖ భారీ ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించింది. రాహుల్ గాంధీ కి వ్యతిరేకంగా నినాదాలు చేపట్టి, దిష్టిబొమ్మను దహనం చేశారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత , ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ రాజకీయ పరిణితి పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అమెరికాలో రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలు వింటుంటే అయన భారతీయుడేనా..? అన్న అనుమానం కలుగుతోందన్నారు. ముఖ్యంగా రాహుల్ గాంధీ విదేశీ పర్యటనకు వెళ్లిన ప్రతి సమయంలో భారత్ ను చులకన చేస్తూ అనేక పిచ్చికూతలు కూసారని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు. ప్రజాస్వామ్యం లేని దేశం భారత్ ...భారత్ కంటే పాకిస్తాన్ ...,బంగ్లాదేశ్ నయం..,. అసలు భారత్ దేశమా.... ,భారత్లో



మైనారిటీలకు రక్షణ లేదు... ,నాకు అసలు భారత్ లో ఉండాలని లేదు... ,ఎన్నికల వ్యవస్థ పైన నమ్మకం లేదనే వ్యాఖ్యలు చేస్తున్న రాహుల్ గాంధీ మెచ్యూరిటీ లేకుండా మాట్లాడుతున్నారా..? లేక దేశంపై పనిగట్టుకుని విషం కక్కుతున్నారా అనే విషయాన్ని ప్రజలంతా గ్రహించాలన్నారు. రాహుల్ గాంధీ దేశభక్తి పై విదేశీ మీడియాలో కథనాలు వస్తున్నాయని, ఆయన భారతీయుడా లేక పాకిస్తానీయుడా అని ఆశ్చర్యం వ్యక్తం చేస్తు కథనాలు రాస్తున్నాయన్నారు. విదేశాల్లో దేశ ప్రతిష్టను దిగజార్చేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుండాలన్నారు. రాహుల్ గాంధీ మాట్లాడిన మాటలను ఆత్మ పరిశీలన చేసుకో కోవాలన్నారు. , ఈ దేశంలో స్వేచ్ఛ లేకపోతే తెలంగాణ, కర్ణాటక ఇతర ప్రాంతాల్లో కాంగ్రెస్ ఎలా గెలిచిందన్నారు. లోకసభలో ప్రతి పక్ష హోదాలో ఉన్న రాహుల్ కు ఏం మాట్లాడాలో ఎంత హుందాగా మాట్లాడాలో తెలుసుకోవాలన్నారు. అలాగే స్వార్థ రాజకీయాల కోసం రాహుల్ గాంధీ మత, రిజర్వేషన్ల రద్దు అంశంతో ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. లోగడ ఎన్నికల సందర్భంగా రిజర్వేషన్ల రద్దు అంశంతో ప్రజలను రెచ్చగొట్టి బిజెపిపై బురదజల్లే ప్రయత్నం చేశారన్నారు. ప్రస్తుతం రాహుల్ గాంధీ విదేశాలలో మీడియాతో మాట్లాడుతూ అదే రిజర్వేషన్ల రద్దు అంశాన్ని ప్రస్తావించారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని బాహాటంగా వ్యాఖ్యానించడానికి సిగ్గుండాలన్నారు. రిజర్వేషన్లు రాజ్యాంగం కల్పించిన హక్కుని, బిజెపి అధికారంలో ఉన్నన్నాళ్లు రిజర్వేషన్లకు డోకా లేదని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. 65 ఏళ్లు దేశాన్ని ఏలిన కాంగ్రెస్కు ప్రజలు తగిన గుణపాఠం చెప్పిన , ప్రజలు కర్రు కాల్చి వాతలు పెట్టిన ఆ పార్టీకి బుద్ధి రావడం లేదన్నారు. దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ గాంధీ సమావేశాలు జరపడంలో ఆంతర్యం ఏమిటో ప్రజలంతా గ్రహించాలన్నారు. స్వార్థ రాజకీయాల కోసం భారతదేశాన్ని కించపరుస్తూ దేశ వ్యతిరేక శక్తులతో కలిసి రాహుల్ గాంధీ కుట్రలు చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు. దేశ ప్రజలంతా రాహుల్ గాంధీ నైజానిల్న ,కుట్రలను గమనించాలన్నారు. దేశ ప్రతిష్టతను దెబ్బ తీసేలా ఎవరు మాట్లాడినా ఊరుకునే ప్రసక్తి లేదని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు కన్న కృష్ణ, కళ్లెం వాసుదేవ రెడ్డి ,సీనియర్ నాయకులు వాసాల రమేష్, కార్పొరేటర్లు కోలగాని శ్రీనివాస్ ,బండ రమణారెడ్డి ,పెద్దపెల్లి జితేందర్, కాసర్ల ఆనంద్ ,గుజ్జేటి శివ ,ఎడమ సత్యనారాయణ రెడ్డి, జానపట్ల స్వామి, లక్ష్మారెడ్డి, రాష్ట్ర కౌన్సిలింగ్ మెంబర్ నాంపల్లి శ్రీనివాస్ దండు కొమురయ్య , బొంతలకళ్యాణ్ చంద్ర , బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు దురిశెట్టి సంపత్ , వాసు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పార్టీ ఇంచార్జ్ ఏనుగు రవీందర్ రెడ్డి

**కబురు న్యూస్ వర్ని సెప్టెంబర్ 12**



వర్ని మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన మాదిరెడ్డి వెంకట్రావు కుటుంబ సభ్యులను బుధవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి ఏనుగు రవీందర్ రెడ్డి పరామర్శించి వారి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. పరామర్శించిన వారిలో నాయకులు ఎలమంచిలి శ్రీనివాసరావు, మాసాని శ్రీనివాస్ రెడ్డి, పాత బాలకృష్ణ, నందు పటేల్, తదితరులు పాల్గొన్నారు

# మేయర్ నిర్వాకంతో అవస్థలు పడుతున్న 30 డివిజన్ ప్రజలు

**కరీంనగర్ సెప్టెంబర్ 12 కబురు న్యూస్**
స్మార్ట్ సిటీ పనుల పేరుతో హౌసింగ్ బోర్డు సమీప ప్రాంతమైన 30వ డివిజన్ మారుతి నగర్ లో మంచిగా ఉన్న రోడ్డును తవ్వి నూతన రోడ్డు నిర్మాణం చేపడతామని అనాలోచితంగా ముందస్తుగా డ్రైనేజీ నిర్మాణం చేపట్టి పనులను అర్ధాంతరంగా మధ్యలో వదిలి వేయడం వల్ల వర్షాలు పడ్డప్పుడు రోడ్లపై నిలిచిన మురుగు నీరు ఎత్తుగా ఉన్న డ్రైనేజీలోకి వెళ్లలేక రోడ్డుపై ఏర్పడిన గుంతలలో నిండిపోవడంతో మా డివిజన్ ప్రజలు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ దుస్థితికి నగర మేయర్ సునీల్ రావు విధానాలే కారణమని భావిస్తున్నాం, ఈ సమస్యలపై నగరపాలక సంస్థకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా స్పందించలేదు.లమేయర్ సునీల్ రావు స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల పేరుతో కమిషన్ల కోసం కక్కుర్తి పడి నాణ్యతతో కూడిన రోడ్లు నిర్మించకపోగా స్మార్ట్ సిటీ పరిధిలో లేని ప్రాంతాల్లో వారి ధన దాహం కోసం రోడ్ల నిర్మాణం చేపట్టడం అందులోనూ కొన్ని ప్రాంతాల్లో అసంపూర్తి పనులు చేపట్టి ఇప్పుడు ఆ ప్రజలకు నరకం చూపిస్తున్నారు.ఈ విధానాలతో ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల



నగర ప్రజలకు, అధికార యంత్రంగానికి, ప్రజా రవాణా వ్యవస్థకు ఆటకం కలుగుతుందని ముందుగానే ఊహించిన మేయర్ సునీల్ రావు గారు వర్షాలు పడే సమయానికి పథకం ప్రకారమే అమెరికా పర్యటన చేసినట్లుగా ఉంది.కోట్ల రూపాయల కమిషన్లు దండుకోవడం కోసం కాంట్రాక్టర్ల చేత పనులు చేయించి ఇప్పుడు బిల్లులు రాక కాంట్రాక్టర్లు ఇబ్బందులు పడుతుంటే మేయర్ సునీల్ రావు చోద్యం చూస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పై నిందలు మోపుతున్నారని.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి గడిచిన 8 నెలల్లో ఒక్కసారి కూడా మేయర్ సునీల్ రావు గ నగర ప్రజల సమస్యలపై కానీ నగర అభివృద్ధి కొరకు నిధుల సమీకరణ గురించి గానీ జిల్లాకు చెందిన మంత్రి పొన్నం ప్రభాకర్ ని కానీ ఇన్చార్జి మంత్రిని గాని కలవకపోవడంలో నగర అభివృద్ధి పట్ల వారికి ఎంత శ్రద్ధ ఉందో స్పష్టమవుతుంది.30వ డివిజన్ లో నెలకొన్న ప్రధాన సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే డివిజన్ ప్రజల పక్షాన జిల్లా మంత్రి పొన్నం ప్రభాకర్ కి విన్నవిస్తమని 30 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దొంతి గోపి అన్నారు

## సెప్టెంబర్ 17న ప్రజాపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి.. జిల్లా కలెక్టర్

**కబురు న్యూస్ కామారెడ్డి సెప్టెంబర్ 12**
తెలంగాణ ప్రజా పాలన దినోత్సవము ఈ నెల 17 న ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో జిల్లాఎస్పీ సిందూ శర్మ తో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశం మేరకు ఈ నెల 17 న తెలంగాణా ప్రజా పాలన కార్యక్రమాన్ని కలెక్టరేట్ లో నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమ నిర్వహణకు శాఖల వారీగా కెటాయించిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ రంగనాథ్ రావు, డిఎస్పీ నరసింహ రెడ్డి,.రాజారాం, మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కబురు
KABURU TELUGU DAILY
శుక్రవారం సెప్టెంబర్ 13 2024

## డ్వాక్రా మహిళలకు ఎలక్ట్రానిక్ ఆటోల పంపిణీ

కబురు న్యూస్ కొ ఆర్డినేటర్ హైదరాబాద్

హైదరాబాద్ :సెప్టెంబర్ 12
తెలంగాణలో రేవంత్ రెడ్డి సర్కార్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుంది. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సరికొత్త పథకాలను ప్రవేశపెడుతూ ప్రజల మన్ననలను పొందుతున్నారు.అందులో మరీ ముఖ్యంగా మహిళల కోసం ఎన్నో పథ కాలను ప్రవేశపెడుతున్నా రు. ఇప్పుడు తాజాగా మరో కీలక నిర్ణయం తీసుకున్నా రు. డ్వాక్రా మహిళలకు సంబంధించి తాజాగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.రాష్ట్రంలో ప్రభుత్వం కొలు వుదీరిన రెండు రోజులకే 6 గ్యారెంటీల్లో రెండు గ్యారం టీలను అమలు చేసింది కాంగ్రెస్. మహిళలకు ఉచిత బస్సు పథకాన్ని అమలు చేసిన తర్వాత ఒక్కొక్క గ్యారెంటీని ప్రారంభించుకుంటూ వస్తోంది.తాజాగా ప్రభుత్వం డ్వాక్రా పొదుపు సంఘాల మహిళ లకు ఎలక్ట్రిక్ ఆటోలు పంపి ణీ చేయాలనీ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లుగా సమా చారం వస్తోంది. ఈ మేరకు నిన్న జనగామ జిల్లా పాలకుర్తిలో ఓ మహిళలకు ఎలక్ట్రిక్ ఆటోను పంపిణీ చేశారు. దీంతో ఆ మహిళ సంతోషం వ్యక్తం చేసింది. డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళలకు లేదా ఆమె కుటుంబంలో లైసెన్స్ ఉన్న వ్యక్తికి ఈ ఎలక్ట్రిక్ ఆటోను ఇవ్వను న్నారు. అయితే ప్రభుత్వం స్త్రీ నిధి లోన్ నుంచి ఈ ఎలక్ట్రిక్ వెహికల్ ను కొను గోలు చేసి ఇవ్వన్నారు.అయితే మహిళలు ఇలా తీసుకున్న ఈ రుణాన్ని వడ్డీతో సహా చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఆటోలకు



ఛార్జింగ్ పాయింట్ల కోసం ప్రభుత్వ అధికారులు అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక అందించనున్నారు...

## గాంధీ ఆస్పత్రిలో మహిళా డాక్టర్ పై దాడి ..?

కబురు న్యూస్ కొ ఆర్డినేటర్ హైదరాబాద్



సికింద్రాబాద్ – గాంధీ ఆస్పత్రిలో ఓ లేడీ జూనియర్ డాక్టర్ పై దాడి కలకలం రేపింది.. మహిళా డాక్టర్ చేయి పట్టుకుని ఆమె అప్రాన్ లాగి రోగి బంధువు ఇబ్బంది పెట్టాడు.అప్రమత్తమైన వైద్య సిబ్బంది డాక్టర్‌ను రక్షించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పీఎస్‌కు అతడిని తరలించారు...

## త్రిసభ్య కమిటీ ఇంటర్వ్యూ....



కబురు న్యూస్‌శంకరపట్నం సెప్టెంబర్ 12

కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో హాస్టల్ వంట సహాయకురాలి ఉద్యోగానికి త్రిసభ్య కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించినట్లు తహసిల్దార్ బత్తుల భాస్కర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ భాస్కర్ మాట్లాడారు కరీంనగర్ జిల్లా మానకొండూరు నియోజకవర్గం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో బాలికలకు హాస్టల్ వసతి ప్రభుత్వం కల్పిస్తుందని, కస్తూరిబా గాంధీ పాఠశాలలో వంట సహాయకురాలి ఉద్యోగం ఖాళీగా ఉన్నందున ప్రభుత్వ ఆదేశం మేరకు ప్రకటనలు జారీచేసి, గురువారం త్రిసభ్య కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించగా 32 మంది దరఖాస్తు చేసుకోగా, 28 మంది ఇంటర్వ్యూ హాజరైనట్లు తెలిపారు. త్రిసభ్య కమిటీ ఇంటర్వ్యూలో ప్రతిభ కనబరిచిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తాసిల్దార్ తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో మండల పరిషత్ ఎంపీడీవో గోల్కొండ కృష్ణ ప్రసాద్, ఎంఈఓ మధుసూదనాచారి, మండల పరిషత్ సూపర్డెంట్ రాఘవేందర్ రెడ్డి, ఆర్ ఐ 2 శ్రీనివాసరెడ్డి దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

## ఏచూరి మృతిపై ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి దిగ్భ్రాంతి



కబురు న్యూస్‌శంకరపట్నం సెప్టెంబర్ 12

భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతిపట్ల కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ జిల్లాశాఖ అధ్యక్షుడు, మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వామపక్ష పార్టీల్లో దిగ్గజ నేతగా ఎదిగిన సీతారాం ను కోల్పోవడం ఆ పార్టీకి తీరని లోటని ఆయన పేర్కొన్నారు. భారత విద్యార్థి సమాఖ్య ద్వారా రాజకీయ రంగ ప్రవేశం చేసిన ఆయన అనతి కాలంలోనే సీపీఐ(ఎం)లో చేరి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యునిగా ఎదిగారని, రాజ్యసభ సభ్యునిగా కూడా సమర్థవంతంగా బాధ్యతలు నిర్వహించారని డాక్టర్ కవ్వంపల్లి కొనియాడారు.సీతారాం ఏచూరి మంచివక్త అని, సమస్యలపై పరిపూర్ణమైన అవగాహన కలిగి ఉండేవారన్నారు.వర్తమాన రాజకీయాల్లో సీతారాం లాంటి నాయకులు అరుదుగా ఉంటారని ఆయన పేర్కొన్నారు.

# నివాసయోగ్యంగా కనీస సౌకర్యాలు కల్పించాలి

- చెత్త డంపింగ్ ను ఎత్తివేయాలి
- లబ్ధిదారులకు ఇండ్లు నిర్మించి ఇవ్వాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

కబురు న్యూస్ ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 12





ప్రభుత్వం పేదలకు ఇచ్చిన నివేశన స్థలాల్లో పేదలు ఇండ్లు నిర్మించుకుంటే, ఇండ్ల ముందు మున్సిపాలిటీ సిబ్బంది చెత్త డంపింగ్ చేస్తున్నారని, వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని, లబ్ధిదారులందరికీ ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కురి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు.

గురువారం రోజున జమ్మికుంట తాహసిల్దార్ కార్యాలయం ఎదుట సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో కలిసి ధర్నా నిర్వహించి, అనంతరం తాసిల్దార్ రమేష్ బాబుకు వినతి పత్రం ఇచ్చారు. తాహసిల్దార్ మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తానని, అర్హులైన వారికి తప్పక న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ 2006-07 సంవత్సరంలో నాటి,నేటి కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన పేదలను గుర్తించి జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 275, 278లో సుమారు 370 మంది పేదలకు నివేశన స్థలాల పట్టాలు పంపిణీ చేశారన్నారు. పట్టాలు పంపిణీ చేసి కనీస సౌకర్యాలు కల్పించలేదన్నారు. 2009 సంవత్సరంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా మెటీరియల్ మరియు డబ్బులు రావడంతో చాలామంది ఇండ్లు నిర్మించుకున్నారని అన్నారు. స్థలాలు కేటాయించారే తప్ప కనీస సౌకర్యాలు కల్పించకపోవడంతో కొన్ని సంవత్సరాలు పాటు అనేక వ్యాయ ప్రయాసాల కోర్చి నివాసం ఉన్నారని, కొంతమంది ఆకతాయిలు బెదిరింపులకు పాల్గొనడంతో ఇల్లు విడిచి పట్టణంలో అద్దె ఇండ్లలో ఉంటున్నారని, తాగునీరు, విద్యుత్ సౌకర్యం, రహదారుల నిర్మాణం లేకపోవడంతో లబ్ధిదారులు సంవత్సరాలపాటు తమ ఇబ్బందులను అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ స్పందించలేదన్నారుఅదే పేదలకు ఇచ్చిన స్థలంలో మున్సిపాలిటీకి 2001 సంవత్సరంలో డి ఆర్ సి సి, ఎఫ్ ఎస్ టి పి కి రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. అప్పటి ఎమ్మార్వో పేదలకు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు ఎలా కేటాయిస్తారని ప్రశ్నించారు. పట్టాలు ఇచ్చిన రెవెన్యూ అధికారులే ఇలా చేయడం దుర్మార్గమన్నారు.370 మంది లబ్ధిదారులకు 80 గజాల చొప్పున నాటి, నేటి కాంగ్రెస్ ప్రభుత్వమే గుర్తించి నివేశస్థలాలు కేటాయించిందని, వారందరికీ న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రజల ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీదేనన్నారు. సంవత్సరాల తరబడి లబ్ధిదారులు తమకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఎమ్మార్వో మొదలుకొని, కలెక్టర్, మంత్రుల చుట్టూ పలుమార్లు తిరిగి వినతి పత్రాలు ఇచ్చినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోగా కేటాయించిన స్థలంలో చెత్త డంపింగ్ చేయడం సరికాదన్నారు. వెంటనే చెత్త డంపింగ్ ని ఎత్తివేసి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఐదు లక్షలు, కేంద్ర ప్రభుత్వం 10 లక్షలు నిధులు మంజూరు చేసి కేటాయించిన స్థలంలోనే ఇండ్లు కట్టించి ఇవ్వాలని, నివాస యోగ్యంగా ఉండేందుకు త్రాగునీటి సౌకర్యం, కరెంటు సౌకర్యం, రహదారులను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పొమ్మనలేక పొగబెట్టినట్లు మున్సిపాలిటీ సిబ్బంది తాము కట్టుకున్న ఇళ్ల ముందు చెత్త కుప్పలు పోయడంతో దుర్గంధం వస్తుందని, రోగాల బారిన పడుతున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏ ప్రభుత్వానికైనా పేదలకు కనీస సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత ఉంటుందని, నోటికి వచ్చిన ముద్దను తిరిగి లాక్కోనే ప్రయత్నాలు మానుకోవాలని, 370 మందిలో అందరూ కూడా కూలి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్న వారేనని, అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారని, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ నిరుపేదలే లబ్ధిదారులుగా ఉన్నారన్నారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ స్పందించి లబ్ధిదారులకు కేటాయించిన స్థలంలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని, చెత్త డంపును ఎత్తివేయాలని వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. లేనియెడల బాధితుల పక్షాన సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తుందని, సమస్య పరిష్కారం అయ్యేంతవరకు నిరంతరం బాధితులకు వెన్నంటే ఉంటుందన్నారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు శీలం అశోక్, నాయకులు కొప్పుల శంకర్, చెలుపూరి రాములు లబ్ధిదారులు నాగిశెట్టి వెంకటేశ్వర్లు, పిక్కల కమల, దామెర సంతోష్, సత్తి సమ్మయ్య, గొర్రె స్వరూప, మాదాసు రవీందర్, సరిత, రాజ్యలక్ష్మి, పద్మ కొడారి రాజుతో పాటు 100మందికి పైగా లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పాడి కౌశిక్ రెడ్డి చిత్రపటానికి పెనాయిల్ తో కడిగిన మున్సిపల్ వైస్ చైర్మన్ స్వప్నకోటి





కబురు న్యూస్ ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్12

జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపల్లి లో దేశిని కోటి ఇంటి వద్ద ఎమ్మెల్యే పాడికౌశిక్ రెడ్డి (నాలిక )చిత్రపటానికి ఫినాయిలతో కడగడం జరిగింది. మహిళల జోలికొస్తే మహిళలను కించపరిచే విధంగా వాక్యాలు చేసిన ఖబర్దార్ కౌశిక్ రెడ్డి అని హెచ్చరించిన మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ చేసిన స్వప్న కోటిలి దేశిని స్వప్న కోటి మాట్లాడుతూ కౌశిక్ రెడ్డి ప్రెస్లో మాట్లాడుతూ టిఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరినందుకు వారికి గాజులు చీరే చూయిస్తూ ఇవి కట్టుకొని మీ వాడలలో తిరగండి అని మాట్లాడడం జరిగింది మహిళల పట్ల ఇలా కించపరుస్తూ మాట్లాడినందుకు అది నోరా మురికి కాల్వన అని కౌశిక్ రెడ్డి నాలిక తో కూడిన చిత్రపటాన్ని పెనాయిలతో కడగడం జరిగింది. కౌశిక్ రెడ్డి ఎప్పుడు సంచలనం ఉండాలని గతంలో తెలంగాణ గవర్నర్ తమిళసై పై బూతు వాక్యాలు మాట్లాడేయండి అప్పుడు కేంద్ర మహిళా కమిషనర్ తనకు నోటీసు ఇచ్చిందు వెంటనే ఢిల్లీకి వెళ్లి నాది తప్పైందని రాతపూర్వకంగా రాసిచ్చి నన్ను క్షమించండి అని చెప్పడం జరిగింది మొన్న అసెంబ్లీ సాక్షిగా పంచాయతీ శాఖ మంత్రి సీతక్కను కించపరిచే విధంగా మాట్లాడిండు అప్పుడు సీతక్క తగిన సమాధానం చెప్పి బుద్ధి చెప్పింది ఇప్పుడు పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు గాజులు చీరే పంపించి కట్టుకోండి తిరగండి అని మాట్లాడడం జరిగింది అంటే గాజులు చీరలు కట్టుకున్న మహిళలంటే అంత చులకన బలహీనమైన చేతగాని వారు అన్ని నీ అర్థం మహిళా అంటే ఏంటో నిన్ను కన్న తల్లిని అడుగు నిన్ను కట్టుకున్న నీ భార్యని అడుగు. నీకు ఓట్లేయరనే కదా నీ భార్యను నీ బిడ్డను వెంటపెట్టుకొని ఓట్లు అడిగావు చస్తాను శివయాత్రకి రండి నేను ఓడిపోతే అని నేను గెలిస్తే విజయోత్సవరాలికి రండి అని మహిళలను సింపతితో ఓట్లు దండుకున్నది నువ్వే కదా మహిళల జోలికొస్తే చెప్పులతో చీపులతో ఇప్పటికే మహిళా సంఘాలు మహిళా నాయకురాలు తిరుగుతున్నారు నీకోసం జాగ్రత్తగా మాట్లాడు వెంటనే మహిళలకు క్షమాపణ చెప్పకపోతే నేను ఈ ప్రాంతం లో తిరుగనివ్వమని హెచ్చరిస్తున్నాం ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పొనగంటి మల్లన్న మాజీ సర్పంచ్ జిల్లెల్ల తిరుపతిరెడ్డి సింగిల్ విండో చైర్మన్ సత్యనారాయణ రెడ్డి. జమ్మికుంట మున్సిపల్ కౌన్సిలర్లు బొంగోని వీరన్న మారేపల్లి బిక్షపతి మేడిపల్లి రవీందర్ ఎలగందుల స్వరూప శ్రీహరి పిట్టల శ్వేత రమేష్ శ్రీపతి నరేష్ పొనగంటి సారంగం పొన్నగంటి రామ్మూర్తి గుల్లి పుల్లమ్మ మొగిలి దేశిని రాధా సదానందం కుదాడి రాజయ్య దిడ్డి రాము రవికంటి రాజు కాంగ్రెస్ నాయకులు ఎప్పటి మధుసూదన్ రెడ్డి మాజీ సర్పంచ్ కరుణాకర్ రెడ్డి తీసిన శ్రీనివాస్ అజయ్ రాజు ఉడుత వెంకటేష్ ఖలీల్ సునీల్ దేవరాజ్ యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ కన్వీనర్ ఎండి సజ్జు పాల్గొన్నారు

# జమ్మికుంట మండల కేంద్రంలో ఉచిత వైద్య శిబిరాలు

కబురు న్యూస్ పతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 12







జమ్మికుంట మండలంలోని వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని చింతలపల్లి గ్రామములో డాక్టర్ హిమబిందు ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించడం జరిగినది. ఈ వైద్య శిబిరం లో ఆరోగ్య సమస్యలు ఉన్న 29 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేయడం జరిగింది. 3గురు జ్వర పీడితులను గుర్తించి, వారి రక్త పూతల నమూనాలను సేకరించి వైద్య పరీక్షల నిమిత్తం ల్యాబ్ కి పంపించనైనది. మరో ముగ్గురికి ఆర్ డీ టి కిట్స్ ద్వారా డెంగీ మరియు మలేరియా వ్యాధి పరీక్షలు చేయడం జరిగినది. అదేవిధంగా మడిపల్లి గ్రామములో డాక్టర్ సంధ్య ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 48 మంది గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయడం జరిగినది. జ్వరం ఉన్న 4 గురికి రక్త పూతల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్ కి పంపించినారు. ఒకరికి ఆర్ డీ టి కిట్ ద్వారా మలేరియా మరియు డెంగీ పరీక్షలు చేసినారు. గ్రామస్తులకు సీజనల్ వ్యాధుల పై అవగహన కల్పించిన్నారు. వ్యక్తి గత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు తెలియ పరిచినారు. డ్రై డే కార్యక్రమముద్వారా నీటీ నిల్వలలో ఉన్న దోమల లార్వా లను నిర్మూలించి దోమలు పుట్టకుండా మరియు కుట్టకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమములో డాక్టర్ హిమబిందు, డాక్టర్ సంధ్య, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్ రెడ్డి, సూపర్ వైజర్ సదానందం,ఏ ఎన్ ఎం లు రజిత, వనజ, సంధ్యరాని మరియు ఆశాకార్యకర్తలు ఇందిర, రమ, సునీత కోమల మరియు గ్రామస్తులు పాల్గొన్నారు

# ఏమి తెలియని నాడు ఏరువాక పున్నమని...














**అన్ని తెలిసిన నాడు అమావాస్య గండమని.... భూమి పుట్టిన చాలా వేల సంవత్సరాల తర్వాత సముద్రాలు ఏర్పడి, వాటినుండి జీవరాశి పుట్టుక ఏర్పడింది.....**

**ఈ భూమి మీద లక్షల కొలది జీవరాసులు ఉన్నాయి...**

**వాటిలో అన్నింటికంటే తెలివైన జీవిగా భావవ్యక్తీకరణ ద్వారా భాషను నేర్చి భూమిని,గగనతలాన్ని కూడా శాసించే స్థాయికి ఎదిగిన మానవులు...**

**మానవుని మనుగడకు..... ఓ మంచి మార్పుకు నాంది..**

**గంగవరం రామకృష్ణారెడ్డి( సీనియర్ జర్నలిస్ట్)**

కబురు న్యూస్ ప్రతినిధి సెప్టెంబర్ 12:

ఆ మధ్య జీవన విధానంలో తాను ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకొని మృగముగా కాకుండా (జంతువులుగా కాకుండా) తెలివైన వాడిగా ప్రకటించుకుని కట్టుబాట్లతో నియమ నిబంధనలతో జీవన విధానాన్ని కొనసాగిస్తూ తాను ఒక ప్రత్యేక వ్యవస్థను సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. తనకు హాని కలిగించే వ్యవస్థల పైన కలిసికట్టుగా యుద్ధం చేయడం కొరకు సంఘజీవులుగా, తమ జీవన విధానంలో తన అవసరాలను బట్టి కుల వ్యవస్థని, ఏర్పాటు చేసుకున్నాడు.తన నిబంధనల ప్రకారం బలమైన జీవిగా,తెలివైన జీవిగాఉంటూ,అంతర్గత కలహాలు అంతర్గత యుద్ధాలు జరగకుండా ఒక న్యాయ వ్యవస్థను తయారు చేసుకున్నాడు మానవుడు....

రాజులుగా రాజ్యాలను ఏర్పాటు చేసుకున్నాడు, నమ్మకాలను బట్టి మతాలను ఏర్పాటు చేసుకున్నాడు.....

మానవుడు ఆనాడు ప్రకృతి పట్ల, పంచభూతాల పట్ల,సృష్టి పట్ల గాని కృతజ్ఞతతో విశ్వాసంగా ఉంటూ, సృష్టి కోసం భావితరాల కోసం సమాజం మొత్తంలో మంచివ్యక్తిగా ఉండాలని 99 శాతం వ్యక్తులు భావించేవాడు.

తన వారసులు సుఖ జీవనానికి అలవాటు పడి తమ మేధస్సుతో, విజ్ఞానంతో యంత్రాల విధానాన్ని కనుగొని ఒక సృష్టికర్తగా అన్ని సృష్టించుకున్నాడు.కానీ సృష్టిలోని ఇంకా రహస్యాలను తెలుసుకోలేక తమాతమవుతున్నారు కాని తాను కనిపెట్టుకున్న రవాణా సౌకర్యాలు అయితేనేమి, సృష్టిలో ఉన్న కొన్ని రహస్యాలు అయితే నేమి విజ్ఞానం ద్వారా తెలుసుకొని, ఒకడిని మించి ఒకడు సుఖాన్ని అనుభవించే దశలో తాను ఏర్పాటు చేసుకున్న విధానంలో ఆధిపత్యంతో అంతర్యుద్ధాలు మొదలై వ్యాపారం అనేటటువంటి ఒక్క వ్యసనంతో పరిదులు దాటి పరిగెత్తడం మొదలుపెట్టాడు..

ఒకరిపై ఒకరు యాజమాన్యం చేసుకుంటూ చట్టాలను (అంటే తమ కట్టుబాట్లను ) మార్పు చేసుకుంటూ రాజరిక వ్యవస్థ బాలేదంటూ ప్రాంతాల వారిగా విడిపోదాం - ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పుకుందాం అంటూ ఒక కొత్త విధానాన్ని తీసుకొచ్చారు.

అక్కడి నుంచి మొదలైంది గతంలో ఎదుర్కొన్న వ్యాధులు అయితే నేమి గతంలో ఎదుర్కొన్నటువంటి సమస్యలన్నింటిని మర్చిపోయి వారు సుఖ జీవనానికి అలవాటు పడినటువంటి అణాలే వారికి ఉరితాడుగా మారాయి అన్న విషయాన్ని ఏ ఒక్కరికి అర్థం అవుతలేదు .

ఎంత అర్థమైనప్పటికీ స్వార్థం అనేటటువంటి ఒక స్వరూపాన్ని నింపుకొని తన మేధస్సును ఉపయోగించి మళ్లీ మోసం అనే ఒక విధానానికి పాల్పడుతున్నాడు .

వెర్రి చేష్టలు ,వెకిలి చేష్టలు, వ్యాపారమే లక్ష్యంగా, అధికారమే గమ్యము,అహంకారము ఇంటి పేరు అధికారము మన వారసత్వము అన్నట్టుగా కొందరు వ్యవహరిస్తే, మరికొందరు ఈ గ్రహం కాకపోతే మరో గ్రహం వెళ్ళిపోతాను, ఈ గాలి లేకపోతే కృత్రిమ గాలి తయారు చేసుకుంటాను,

ఈ నీరు లేకపోతే ఆకాశాన్ని పిండి పంచభూతాలను తన్ని తెచ్చుకుంటాను నాకేంటి ఇప్పుడు సుఖంగా ఉండాలె తపన..

ఈ క్షణం నేను అనుభవించాలి అనే ధోరణిలో బ్రతుకుతూ సమాజంపై బాధ్యతలు లేకుండా వ్యవహరిస్తూ, సృష్టించిన అమ్మని ప్రాణం పోసిన ప్రకృతిని నాశనం చేస్తున్నారు.

కావున నేటి తరం కొత్తగా ఆలోచించండి .

అతిగాపెరిగే చెట్టు విరగక తప్పదు .

పొంగిన పాలు పొయ్యి పాలు కాక తప్పదు అన్నవి ఎంత సత్యమో విజ్ఞానాన్ని పెంచుకుంటూ పోతే వినాశనం అవుతుంది. దేశాన్ని పాలించే పాలకులారా దేశ విదేశ వ్యవహారాలు చూస్తున్న నాయకులారా మార్పులు తేవడానికి ప్రయత్నం చేద్దాం.మార్పు అనేది ఎక్కడో కాదు మన ప్రాంతంలో మనము కొత్త విధానాలు పాటిస్తే సమాజంలో మార్పు తప్పక మొదలవుతుంది ఆ ప్రయత్నించి చూద్దాం..మీ గంగవరం రామకృష్ణారెడ్డి (సీనియర్ జర్నలిస్టు)



# సామాన్యులకు ఒక న్యాయం!!

**సంపన్నులకు ఇంకో న్యాయమా!!??**

**బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెప్టెంబర్ కబురు న్యూస్



కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలో సామాన్యులకు ఒక న్యాయం సంపన్నులకు ఇంకో న్యాయం అన్నట్లుగా మున్సిపల్ అధికారుల వ్యవహారశైలి ఉందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ మండిపడ్డారు.గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా 30వ వార్డు మధురబస్తీలో అనుమతులు లేకుండా చేస్తున్న అక్రమ సెల్లార్ నిర్మాణం విషయంలో తమ పార్టీ ఆధ్వర్యంలో గత నాలుగు నెలలుగా అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదులు చేసినా తూతూమంత్రంగా నోటీసులు జారీ చేయడం తప్ప చర్యలు తీసుకున్న పాపాన పోలేదని విమర్శించారు.తదుపరి చర్యల కోసం టాస్క్ ఫోర్స్ కమిటీకి లేఖరాసి చేతులు దులుపుకున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు.కావాలని జాప్యం చేస్తూ పరోక్షంగా అక్రమ నిర్మాణం చేపడుతున్న వారికి సహకరిస్తున్నారని ఆరోపించారు.జాతీయ రహదారిపై ఇసుక,కంకర పోసి పాదచారులు, వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై,అధికారుల వ్యవహారశైలి పట్ల స్థానిక ఎంఎల్ఏ సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు.అధికారుల తీరుకు నిరసనగా త్వరలో మున్సిపల్ కార్యాలయం ముట్టడించేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంధం మల్లికార్జున రావు,జిల్లా ప్రధాన కార్యదర్శి మాలోత్ వీరు నాయక్,సమీర్,నిఖిల్,మురళి తదితరులు పాల్గొన్నారు.

**ప్రభుత్వ మెడికల్ కాలేజ్ కుత్బుల్లాపూర్ లోనే నిర్వహించాలి.**

**సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్.**

కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12కబురు న్యూస్



సీపీఐ చేసిన అనేక పోరాటాల వల్ల మెడికల్ కాలేజ్ ను కుత్బుల్లాపూర్ లో ఏర్పాటు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం జరిగింది, కానీ ఇక్కడ మెడికల్ కాలేజ్ నిర్వహణ కోసం భవనం లేదని నేడు ఇతర ప్రాంతాలో మన పేరుతో నిర్వహించడం దురదృష్టకరమని కావున వెంటనే స్థానిక శాసనసభ్యుడు వివేకానంద గారు మెడికల్ కాలేజ్ మన ప్రాంతంలో నే ఉండేలా చర్యలు చెప్పటలని డిమాండ్ చేశారు.

సీపీఐ ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ లోనే మెడికల్ కాలేజ్ సాధన కొరకు అన్ని రాజకీయ పక్షాలతో సమావేశమ్ నిర్వహించి పోరాటం కొనసాగిస్తామని అన్నారు. అధికారంలో ఉన్న నాయకులకు దూరదృష్టి లేకపోవడం వల్ల గతంలో జగతగిరిగుట్ట కు మంజూరు అయ్యిన ఎస్సీ,ఎస్టీ గురుకుల విద్యాలయం తరలిపోవడం, మళ్ళీ ఇప్పుడు మెడికల్ కాలేజ్ పోవడం జరిగిందని ఇప్పటికైనా అధికారంలో ఉన్న పార్టీల నాయకులు ప్రజల సంక్షేమం కోసం పనిచేయ్యాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ కార్యవర్గ సభ్యుడు హరనాథ్,ప్రజానాట్యమండలి జిల్లా, మండల అధ్యక్షుడు ప్రవీణ్,బాబు,కార్యదర్శి భాస్కర్,మండల కోశాధికారి సదానంద్, కార్యదర్శి సహదేవరెడ్డి, సీపీఐ నాయకులు డప్పు రామస్వామి,సామెల్,ఇమామ్, ప్రభాకర్,నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

**గణనాథుడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న:బిసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్**



కబురు న్యూస్ సెప్టెంబర్ 12

గచ్చిబౌలి డివిజన్ నేతాజీ నగర్ కాలనీలో వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం, అన్నదాన కార్యక్రమం లో పాల్గొన్న బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్ యాదవ్.తను మాట్లాడుతూ... అందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని మహా గణనాథుని వేడుకున్నారు. ఈ కార్యక్రమములో ఆలయ కమిటీ సభ్యులు తిరుమలేష్ ,యాదగిరి, సాగర్, దయాకర్ సాగర్, కే రాము యాదవ్, కాలనీ ఉపాధ్యాయులు రాయుడు, భువన్, రాజు, రమేష్, కృష్ణ, కాలనీ పెద్దలు ,మహిళా సంఘాలు యువజన నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**దుండిగల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్...**

**ముఖ్య అతిధిలుగా పాల్గొన్న DCP కోటిరెడ్డి IPS గారు..ACP శ్రీనివాస్ రెడ్డి**







కుత్బుల్లాపూర్ సెప్టెంబర్ 12 కబురు న్యూస్

సైబరాబాద్ CP అవినాష్ మహంతి IPS గారి సూచన మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, దుండిగల్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ పోలిసింగ్ , ఫ్రెండ్లీ పోలిసింగ్ లో భాగంగా మెగా క్రికెట్ టోర్నమెంట్ ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్ లో దుండిగల్ PS పరిధిలోని రెవెన్యూ, మున్సిపల్ ఉద్యోగులు, పోలీస్ ఉద్యోగులు, ప్రెస్ సోదరులు మరియు పలు గ్రామాల, కాలనీల యువకులు పాల్గొన్నారు. మొత్తంగా 10 రోజులు నిర్వహించిన ఈ ఈవెంట్ లో 14 జట్లు పాల్గొనగా భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ మరియు గండిమైసమ్మ యువకుల టీమ్స్ ఫైనల్లో తలపడగా భౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ యువకుల జట్టు ఫైనల్ ట్రోఫీ ని గెలుపొందారు. అనంతరం గెలుపొందిన జట్టు కి ముఖ్య అతిధిగా పాల్గొన్న DCP కోటిరెడ్డి గారు ట్రోఫీని అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని గ్రామాలను, కాలనీల ప్రజలను పోలీసులతో స్నేహ పూర్వకంగా ఉంటూ, ఒకరికొకరు సహకరించుకునేందుకు ఇటువంటి టోర్నీలను నిర్వహస్తున్నామని తెలియజేసారు. ఈ టోర్నీ నిర్వహణకు సహకారం అందచేసిన కౌన్సిలర్ శ్రీనివాస్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో దుండిగల్ పోలీస్ స్టేషన్ CI సతీష్ గారు, SI లు రామ్మోహన్ రెడ్డి గారు, శంకర్ గారు, DI సతీష్ గారు, భౌరంపేట్ కౌన్సిలర్ నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి గారు మరియు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం బ్యారేజీని సందర్శించిన కేంద్ర బృందం



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 12


నగరంలోని ప్రకాశం బ్యారేజీని కేంద్ర బృందం సందర్శించింది. బ్యారేజీ నీటి ప్రవాహం తదితర విషయాలను జలవనరుల శాఖ అధికారులు వారికి తెలిపారు. దీనికి సంబంధించిన వివరాలను ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు కేంద్రబృందానికి అందజేశారు. ఈ నెల 1న రికార్డు స్థాయిలో 11.43లక్షల క్యూసెక్కుల వరద వచ్చిందని తెలిపారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో పరిస్థితి, ముంపునకు సంబంధించిన వివరాలను కేంద్ర బృందం దృష్టికి ఆయన తీసుకెళ్లారు.

## మంగళగిరిలో వరద నష్టాలను పరిశీలించిన కేంద్రబృందం



# ఏపీలో ఆహారశుద్ధి యూనిట్‌ల ఏర్పాటుకు అపార అవకాశాలు

ఏపీలో ఆహారశుద్ధి యూనిట్‌ల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు అన్నారు.



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 12

ఏపీలో ఆహారశుద్ధి యూనిట్‌ల ఏర్పాటుకు అపారమైన అవకాశాలు ఉన్నాయని సీఎం చంద్రబాబు అన్నారు. సచివాలయంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ, ఆహారశుద్ధి పరిశ్రమలపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఉపాధి కల్పనలో కీలకమైన ఎంఎస్‌ఎంఈల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇచ్చి వాటికి చేయూత ఇస్తుందన్నారు. ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తే ఈ రంగం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని సీఎం అన్నారు. సవాళ్లతో దెబ్బతిన్న ఈ రంగాన్ని సరికొత్త విధానాల ద్వారా మళ్లీ గాడిన పెడతామని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఎంఎస్‌ఎంఈ పార్కులను త్వరితగతిన పూర్తి సౌకర్యాలు కల్పించి పరిశ్రమల ఏర్పాటును వేగవంతం చేస్తామన్నారు. భూములు కలిగిన రైతులు, ప్రైవేటు భాగస్వామ్యంతో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం పార్క్‌లు ఏర్పాటు చేసుకునే విధానాన్ని అమల్లోకి తేవాలని సూచించారు. రాజధానిలో రైతుల భాగస్వామ్యంతో వారికి ఎలా లబ్ధి చేకూర్చామో అదే తరహా విధానాన్ని ఎంఎస్‌ఎంఈ పార్కుల ఏర్పాటులోను అవలంభించాలన్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఏడు క్లస్టర్లను పూర్తి చేయాలన్నారు. ఎంఎస్‌ఎంఈకి క్రెడిట్ గ్యారెంటీ కింద రూ.100 కోట్లు కేటాయిస్తామని సీఎం తెలిపారు.

# సిజెఐ చంద్రచూడ్ నివాసంలో వినాయక పూజ



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 12

● ప్రధాని మోడీ హాజరు కావడంపై విమర్శలు

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నివాసంలో జరిగిన వినాయక పూజలో ప్రధాని నరేంద్ర మోడీ పాల్గొన్నారు. సిజెఐ ఇంటికి వెళ్లిన ప్రధాని మోడీపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. న్యాయమూర్తులు ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినట్టేనని ప్రముఖ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ తెలిపారు. ప్రశాంత్ తన ట్విట్టర్‌లో ట్వీట్ చేశారు. ప్రైవేట్ మీట్ కోసం సిజెఐ చంద్రచూడ్ తన నివాసానికి మోడీని అనుమతించడం మంచిది కాదు అని, ఇలాంటి సమయంలో న్యాయవ్యవస్థపై ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళ్తాయని భూషణ్ పేర్కొన్నారు. సిజెఐ ఇంట్లో జరిగిన గణపతి పూజలో ప్రధాని మోడీ పాల్గొన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సిజెఐ ఇంటికి ప్రధాని వెళ్లడం ఎంత వరకు సరైందని నెటిజన్లు నిలదీస్తుండగా మరికొందరు సమర్థిస్తున్నారు. సిజెఐ ఇంట్లో ప్రధాని పూజలో పాల్గొనడం తప్పుడు సంకేతాలు ఎలా అవుతాయని మరికొందరు కామెంట్లు చేస్తున్నారు.

## అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు మంగళగిరి స్టేడియం

కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 12

ఏపీ ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహకారంతో గుంటూరు జిల్లా మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో స్పోర్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.




ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సహకారంతో గుంటూరు జిల్లా మంగళగిరిలోని అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో స్పోర్ట్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామని ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పేర్కొన్నారు. గురువారం మంగళగిరిలో అంతర్జాతీయ క్రికెట్ మైదానంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధికి పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని శివనాథ్ తెలిపారు. విశాఖలో ఉన్న అంతర్జాతీయ క్రికెట్ మైదానానికి తోడుగా మరో మైదానాన్ని నిర్మిస్తామని చెప్పారు. మంగళగిరిలోని క్రికెట్ మైదానాన్ని అంతర్జాతీయ మ్యాచ్‌ల నిర్వహణకు వీలుగా అభివృద్ధి చేస్తున్నామన్నారు.

## ఎర్రమట్టి దిబ్బలపై విచారణకు ఆదేశించిన ఏపీ ప్రభుత్వం

● భీమిలి మండలంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది.



కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 12

విశాఖ ఎర్ర మట్టి దిబ్బలను ఆనుకొని ఉన్న నేరెళ్ల వలస గ్రామంలోని భీమునిపట్నం మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీకి ఇచ్చిన భూములను రద్దు చేయాలంటూ జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ఇచ్చిన పిటిషన్‌పై ఏపీ ప్రభుత్వం స్పందించింది. భీమిలి మండలంలో ఉన్న ఎర్రమట్టి దిబ్బలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్‌ను ఏపీ ప్రభుత్వం ఆదేశించింది. సర్వేనెంబర్ 118/ 5ఏ లో 250 ఎకరాలకుపైగా భూములను ఈ హౌసింగ్ సొసైటీకి కేటాయించారు. ఇవన్నీ ఎర్రమట్టి దిబ్బల ప్రాంతంలోనే ఉన్నాయని జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ ప్రభుత్వానికి ఆధారాలతో ఫిర్యాదు సమర్పించారు. వారసత్వ సంపదగా ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణ చేయాలని మూర్తియాదవ్ కోరారు. దీనిపై జిల్లా కలెక్టర్ ఇచ్చే నివేదిక ఆధారంగా ప్రభుత్వం నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

# రూ.2వేల కోట్ల ట్రేడింగ్ స్కామ్.. నటి అరెస్టు

ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ స్కామ్ లో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓ నటిని పోలీసులు అరెస్టు చేశారు.

● అస్సాంలో కలకలం సృష్టించిన ఆన్‌లైన్ స్టాక్ ట్రేడింగ్ స్కామ్ లో ఒక నటిని పోలీసులు అరెస్టు చేశారు.

● గురువారం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ నటి సుమిబోరా, ఆమె భర్త తార్కిక్ బోరాను అదుపులోకి తీసుకుందని పోలీసులు ఉన్నతాధికారులు వెల్లడించారు.

● ఈ కేసులో వీరిపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు జారీ అయిన నేపథ్యంలో తాజాగా వారి అరెస్టు






గువాహటి: అస్సాం పోలీసులు ఇటీవల రూ.2 వేల కోట్ల కుంభకోణం గుట్టు రట్టు చేశారు. పెట్టుబడిని రెట్టింపు చేస్తామంటూ స్టాక్‌మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్ల పేరిట ప్రజల నుంచి మోసగాళ్లు సొమ్మును సమీకరించారు. ఈ కేసులో ఇప్పటికే విశాల్ ఫుకాన్‌ను అరెస్టు చేశారు. 60 రోజుల్లో పెట్టుబడులపై 30 శాతం రాబడి వస్తుందని విశాల్ నమ్మబలికాడు. నాలుగు నకిలీ సంస్థలను స్థాపించి, అస్సాం చిత్ర పరిశ్రమలో పెట్టుబడులు పెట్టాడు. పలు ఆస్తుల్ని కూడబెట్టాడు. ఈ కుంభకోణంలో బోరా దంపతులతో పాటు మరికొందరిపైనా ఆరోపణలు వచ్చాయి. అతడి అరెస్టు తర్వాతే వీరిని పోలీసులు విచారణకు పిలిచారు. అయితే వీరు హాజరుకాకపోవడంతో లుకౌట్ నోటీసులు జారీ చేసి, తాజాగా అదుపులోకి తీసుకున్నారు.

బుధవారం సదరు నటి ఓ వీడియో సందేశాన్ని విడుదల చేశారు. "పరువుకు నష్టం కలిగించేలా నా కుటుంబంపై వార్తలు వస్తోన్న నేపథ్యంలో నేను పోలీసుల ముందు లొంగిపోవాలని, విచారణకు సహకరించాలని నిర్ణయించుకున్నాను. నేను ఎక్కడికీ పారిపోలేదు. మీడియాలో వస్తోన్న కథనాలతో మాకు ఎదురైన వేధింపుల వల్ల మేం పబ్లిక్‌కు దూరంగా ఉన్నాం. ఆ వార్తల్లో 10 శాతం కూడా వాస్తవం లేదు" అని వెల్లడించారు. ఆమె లొంగిపోతానని చెప్పిన మరుసటి రోజే..పోలీసులు అదుపులోకి తీసుకోవడం గమనార్హం. ఇదిలా ఉంటే.. తొలుత మీడియా కథనాల్లో ఈ స్కామ్ విలువ రూ.22 వేల కోట్లు అని రాగా.. తర్వాత ఆ మొత్తం రూ. 2వేల కోట్లుగా పేర్కొన్నాయి.

# భాకరాపేట ఘాట్ రోడ్ లో రోడ్డు ప్రమాదం

## 2నలుగురు దుర్మరణం

## ఎక్స్కవేటర్ తో క్షతగాత్రులను బయటకు తీస్తున్న పోలీసులు

## లారీ అతివేగమే ప్రమాదానికి కారణం

కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 12

తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం భాకరాపేట ఘాట్ రోడ్డులో టమోటాలు తరలిస్తున్న కంటైనర్ అతివేగంగా కారు, బైక్ ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. మరో ఇద్దరు కారు లోపల చిక్కుకొని ఉన్నారు. ఎక్స్కవేటర్తో కంటైనర్ నుండి కారును విడదీసి కారులో ఉన్న జతగాత్రులను చంద్రగిరి పోలీసులు వెలికి తీశారు. కంటైనర్ కలికిరి నుంచి టమోటా లోడ్ వేసుకొని చెన్నైకి వెళుతున్న నేపథ్యంలో భాకరాపేట ఘాట్ నందు డ్రైవర్ అతి వేగంగా నడపడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు తెలిపారు. ఈ పరిప్రమాదంలో కారు నుజ్జునుజ్జయింది. చంద్రగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బరామిరెడ్డి తెలిపారు.



# పెరిగిన గోదావరి వరద..!

## నీట మునిగిన లంక గ్రామాలు.

## ప్రజల పాట్లు,అందని సహాయక చర్యలు.

## స్థంబించిన జనజీవనం

కబురు న్యూస్, డెస్క్ :సెప్టెంబర్ 12

కోనసీమలో గోదావరి వరద ఉగ్రరూపం దాల్చుతోంది. నెలరోజుల వ్యవధిలో మూడు సార్లు గోదావరికి వరద ముంచెత్తడంతో లంక ప్రజలు బెంబేలె త్తిపోతున్నారు. కోనసీమలో ప్రధాన నదులైన వృద్ధ గౌతమి, వశిష్ట వైనతేయ గోదావరి పాయలకు వరద పోటెత్తింది. ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద నీటితో కోనసీమలో నదులన్నీ ఉధృతంగా ప్రవహస్తున్నాయి. ఇప్పటికే కోనసీమలో దాదాపు 60 లంక గ్రామాల ప్రజలు పునరావాసం కోసం జిల్లా అధికార యంత్రాంగం రంగం సిద్ధం చేసింది. ఏ క్షణాన వరద ముంచెత్తుతుందో అనే భయంతో పీడిస్తోంది. లంక గ్రామాల ప్రజలతోపాటు లోతట్టు ప్రాంతాలవారిని సు రక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లా కలెక్టర్ మహేష్ కునార్, అమలాపురం ఆర్డీవో కోనసీమ జిల్లాలో అన్ని మండల రెవెన్యూ కార్యాలయాలకు హై అలెర్ట్ ప్రకటించారు. కోనసీమ జిల్లాలో అన్ని తహశీల్దార్ కార్యాలయాలను ఇప్పటికే వరద పరిస్థితిపై జిల్లా కలెక్టర్, ఆర్డిఓలు సంకేతాలు పంపారు.

**ఏటిగట్లను తాకిన ప్రవాహం..!**

ధవళేశ్వరం వద్ద ముడో ప్రమాద హచ్చరిక జారీ చేయగా గోదావరి వరద కోనసీమలో అన్ని ఏటిగట్లను తాకేసింది. పల్లప్రాంతాలు జలమయ మయ్యాయి. వరద ప్రభావంతో కోనసీమలో మేజరు, మైనరు కాల్వలు పొంగిపొర్లుతున్నాయి. రాజోలు నియోజకవర్గంలోని అప్పనారామునిలంక ? టెకిశెట్టిపాలెం ఉన్న నదీపాయపై ఉన్న వంతెన చుట్టూ.. కొత్తలంక కాజ్‌వే పైకి వరదనీరు చేరి.. రాకపోకలు నిలిచిపోయాయి.

తెలుగు దినపత్రిక కబురు KABURU TELUGU DAILY



# కమల్ హాసన్, మణిరత్నం సినిమాలో నటిస్తున్నా: నటి అభిరామి



**కబురు సినిమా సెప్టెంబర్ 12..**
ఒకప్పుడు హీరోయిన్‌గా ఆకట్టుకుని రీఎంట్రీలో మహారాజ, సరిపోదా శనివారం లాంటి చిత్రాలతో మెప్పించారు అభిరామి. రాజ్ తరుణ్ హీరోగా వస్తున్న 'భలే ఉన్నాడే' చిత్రంలో ఆమె మదర్‌గా నటించారు. జె శివసాయి వర్ధన్ దర్శకత్వంలో ఎన్‌వి కిరణ్ కుమార్ నిర్మించిన ఈ చిత్రం శుక్రవారం విడుదలవుతున్న సందర్భంగా అభిరామి ఇలా ముచ్చటించారు."రీఎంట్రీ తర్వాత నేను తెలుగులో సైన్ చేసిన ఫస్ట్ సినిమా ఇదే. దర్శకుడు చెప్పిన కథ, నా క్యారెక్టర్ నచ్చడంతో వెంటనే ఓకే చెప్పాను. గౌరీ అనే బ్యాంక్ ఉద్యోగిగా కనిపిస్తా. సింగిల్ మదర్‌గా స్ట్రాంగ్ ప్రిన్సిపల్స్ ఉన్న మహిళ పాత్ర. తనలో సీరియస్?నెస్‌తో పాటు హ్యూమర్, ఎమోషన్ ఉంటాయి. సినిమా మొత్తం కనిపించే పాత్ర. మదర్ అండ్ సన్ రిలేషన్‌షిప్ ఈ సినిమాకు సోల్. దర్శకుడు క్లియర్ విజన్‌తో తెరకెక్కించారు.ఇక కెరీర్ విషయానికొస్తే..'చెప్పవే చిరుగాలి' షూటింగ్ తర్వాత డిగ్రీ చేయడానికి యూఎస్ వెళ్లా. తర్వాత కొన్ని ఆఫర్స్ వచ్చినా, యూఎస్‌లో ఉండిపోవడం వల్ల కుదరలేదు. పదేళ్ల క్రితం కమల్ హాసన్ గారు 'విశ్వరూపం'లో హీరోయిన్ పాత్రకు డబ్బింగ్ చెప్పేందుకు నన్ను రప్పించారు.అప్పటి నుంచి వరుస ఆఫర్స్ వస్తున్నా.. స్టోరీకి ప్రయారిటీ ఇస్తూ సెలక్టివ్‌గా చేస్తున్నాను. గత రెండేళ్ళలో పది సినిమాలు చేశా. టీవీ యాంకర్ నుంచి హీరోయిన్ అవడం మొదలు, తిరిగి రావడం వరకూ కెరీర్‌లో ఏదీ ప్లాన్ చేయలేదు. అదొక హ్యాపీ యాక్సిడెంట్.ప్రస్తుతం లీడ్ రోల్‌లో రెండు తమిళ చిత్రాలు చేస్తున్నా. అలాగే కమల్ హాసన్, మణిరత్నం గారి సినిమాలో నటిస్తున్నా. తెలుగులోనూ రెండు కథలు విన్నా. ఇంకొన్ని ఆసక్తికరమైన చిత్రాలు ఉన్నాయి".

# అప్పటిదాకా నా సినిమాలను డబ్ చేయొద్దు.. నిర్మాతలను కోరిన మహేశ్?ఓ

**కబురు సినిమా సెప్టెంబర్ 12..**
మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ ప్రాజెక్ట్ రూపొందనున్న సంగతి తెలిసిందే. SSMB29'గా ఇది ప్రచారంలో ఉంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు దీనికి సంబంధించిన అధికారిక అప్‌డేట్స్ రానప్పటికీ ఈ ప్రాజెక్ట్ మాత్రం ఎప్పుడూ ట్రెండింగ్‌లోనే ఉంటోంది. తాజాగా దీనికి సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.తన సినిమాల విషయంలో మహేశ్ చాలా జాగ్రత్తలు తీసుకుంటారు. రాజమౌళి ప్రాజెక్ట్‌తో మహేశ్ పాన్ వరల్డ్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. దీంతో బాలీవుడ్ వెండితెరపై ఈ సినిమాతోనే హిందీ ఆడియన్స్‌ను పలకరించాలని ఆయన ఫిక్స్ అయ్యారట. అందుకే SSMB29' విడుదలయ్యే వరకు తన గత చిత్రాలను హిందీలోకి డబ్ చేసి థియేటర్‌లలో రిలీజ్ చేయొద్దని నిర్మాతలను కోరినట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు మహేశ్ నేరుగా ఏ హిందీ సినిమాలోనూ నటించలేదు. దీంతో బాలీవుడ్‌లో ఇదే తన తొలి చిత్రమవుతుందని ఆసక్తిగా ఉన్నారు.అందుకే అక్కడి ఆడియన్స్‌ను అలరించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.ఈ



సినిమాను ప్రకటించినప్పటి నుంచి అప్‌డేట్స్ కోసం అభిమానులు ఎదురుచూస్తూనే ఉన్నారు. పండగలకు, మూవీ యూనిట్‌లో వాళ్ల పుట్టిన రోజులకు దీని నుంచి ఏమైనా అప్‌డేట్ ఇస్తారేమో అని ఆశపడ్డారు. అయితే రాజమౌళి మాత్రం సినిమాకు సంబంధించిన ఏ విషయాన్ని బయటకు రానీయకుండా జాగ్రత్త పడుతున్నారు . సినిమాలో ప్రతి సన్నివేశం పర్‌ఫెక్ట్‌గా వచ్చేంతవరకూ విశ్రమించని జక్కన్న.. ఈ ప్రాజెక్ట్ విషయంలో మరింత శ్రద్ధపెట్టారట. 'ఆర్‌ఆర్‌ఆర్' తర్వాత తెరకెక్కిస్తున్న చిత్రం కాబట్టి ఆ అంచనాలను దృష్టిలో పెట్టుకునే ప్రతిదాన్ని ప్లాన్ చేస్తున్నారు. అందుకే ప్రీ ప్రొడక్షన్ పనులను కూడా దగ్గరుండి చూసుకుంటున్నట్లు తెలుస్తోంది.లోకేషన్స్, నటీనటుల ఎంపిక తదితర విషయాల్లో ఆయన ఎక్కడా రాజీ పడకూడదని నిర్ణయించుకున్నట్లు సమాచారం. ఈ కారణంతోనే సినిమా అప్‌డేట్స్ ఆలస్యమయ్యే అవకాశం ఉందని టాక్. ఈ ఏడాది చివరి నాటికి సినిమాకు సంబంధించిన పనులు ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. కొత్త సంవత్సరంలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక అప్‌డేట్ వెలువడుతుందని విశ్వసనీయ వర్గాల సమాచారం. తన సినిమాల గురించి ప్రెస్ మీట్ పెట్టి అప్‌డేట్స్ ఇవ్వడం రాజమౌళికి అలవాటు. మహేశ్ మూవీ విషయంలోనూ ఇదే పద్ధతిని అనుసరించాలని భావిస్తున్నారు. ఏదేమైనా మహేశ్ అభిమానులతో పాటు సినీ ప్రియులంతా ఈ సినిమా నుంచి చిన్న అప్‌డేట్ వస్తే బాగుండనుకుంటున్నారు.అమెజాన్ అడవుల నేపథ్యంలో సాగే ఈ కథలో పలువురు విదేశీ నటులు కనిపించనున్నారు. భారతీయ భాషలతో పాటు, విదేశీ భాషల్లోనూ దీనిని అనువదించనున్నారు. దుర్గా ఆర్ట్స్‌పై కె.ఎల్.నారాయణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వెండితెరపై సరికొత్త లుక్‌లో మహేశ్ కనిపించనున్నారు. ఆ పాత్ర కోసం ఆయన ఇప్పటికే సన్నద్ధమయ్యారు.

# రజనీకాంత్ అభిమానిని.. అందుకే కథ విననని చెప్పా: ఉపేంద్ర




**కబురు సినిమా సెప్టెంబర్ 12..**
రజనీకాంత్ పై అభిమానం వ్యక్తం చేశారు ఉపేంద్ర . 'ఓన్లీ వన్ సూపర్‌స్టార్' అంటూ ప్రశంసలు కురిపించారు. ఈ ఇద్దరు కలిసి నటిస్తున్న చిత్రం 'కూలీ' . లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా గురించి తాజాగా పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఉపేంద్ర మాట్లాడారు. "లోకేశ్ నాకు ఫోన్ చేసి 'కూలీ' కథకు సంబంధించి ఓ పాయింట్ చెప్పారు. అందులో రజనీకాంత్ హీరో అని తెలుసు కాబట్టి.. అంతకు మించి నాకేం చెప్పకండి అని లోకేశ్‌కు సమాధానమిచ్చా. సినిమాలో తప్పకుండా నటిస్తానని చెప్పా. నేను రజనీకాంత్‌కు పెద్ద అభిమానిని. రజనీకాంత్ సినిమాలో భాగం కావాలని ఎవరికి ఉండదు?. తెరపై ఆయన పక్కన కాసేపు కనిపించినా చాలు" అని అన్నారు.రజనీకాంత్ 171వ సినిమా 'కూలీ'. బంగారం స్మగ్లింగ్ నేపథ్యంతో సాగే యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం రూపొందుతోంది. ఒక్కో చిత్ర పరిశ్రమ నుంచి ఒక్కో అగ్ర నటుడు ఈ ప్రాజెక్టులో భాగమయ్యారు. శాండిల్‌వుడ్ నుంచి ఉపేంద్ర ఎంపికవగా.. టాలీవుడ్ నుంచి నాగార్జున, మాలీవుడ్ నుంచి సౌబిన్ షాహిర్ నటిస్తున్నారు. శ్రుతి హాసన్, సత్యరాజ్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

# 'దేవర' చూసేవరకైనా బతికించండి: ఎన్టీఆర్ అభిమాని ఆఖరి కోరిక




**కబురు సినిమా సెప్టెంబర్ 12..**
'దేవర' చూసేవరకు తనను బతికించాలని ఓ క్యాన్సర్ పేషెంట్ చివరి కోరిక కోరుతున్నాడు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కౌశిక్ (19) కొంతకాలంగా బోన్ క్యాన్సర్‌తో బాధపడుతున్నాడు. అతడు జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని కావడంతో చనిపోయేలోపు 'దేవర' చూడాలని కోరుకుంటున్నట్లు అతని తల్లిదండ్రులు తెలిపారు. ఈ మేరకు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియా సమావేశం నిర్వహించారు.'నా కుమారుడికి చిన్నప్పటినుంచి జూనియర్ ఎన్టీఆర్ అంటే చాలా ఇష్టం . ఇప్పుడు కూడా చివరి కోరికగా 'దేవర' చూడాలని అడుగుతున్నాడు. సెప్టెంబర్ 27 వరకు తనను బతికించాలని డాక్టర్లను వేడుకుంటున్నాడు. అది ఒక్కటే అతని ఆఖరి కోరిక' అంటూ కౌశిక్ తల్లి కన్నీటి పర్యంతమయ్యారు. తన కుమారుడి వైద్యానికి రూ.60లక్షలు ఖర్చు అవుతుందని ప్రభుత్వం, దాతలు సాయం చేయాలని ఆమె కోరారు. ఈ వీడియోను షేర్ చేస్తున్న తారక్ అభిమానులు ఆయన్ని ట్యాగ్ చేస్తున్నారు.తనని ప్రేమించే అభిమానులన్నా, వారి కుటుంబసభ్యులన్నా ఎంతో ఆప్యాయత కనబరుస్తుంటారు యంగ్ టైగర్ ఎన్టీఆర్ . గతేడాది ఓ అభిమాని తన తల్లికి ఆయనంటే ఎంతో ఇష్టమని చెప్పగా.. తారక్ ఆమెతో స్వయంగా ఫోన్‌లో మాట్లాడి ఆ అభిమాని కోరిక తీర్చారు.

# దాని కారణంగా ఎన్నో అవకాశాలు కోల్పోయా: రకుల్ ప్రీత్ సింగ్



**కబురు సినిమా సెప్టెంబర్ 12..**
నెపోటిజం (బంధుప్రీతి).. ఈ పదం సినిమా రంగంలో ఎక్కువగా వినిపిస్తుంటుంది. తమ సినిమా ప్రచారంలో భాగంగా ఇంటర్వ్యూల్లో పాల్గొన్న నటులకు తరచూ దానిపై ప్రశ్న ఎదురవుతుంటుంది. తాజాగా నటి రకుల్ ప్రీత్ సింగ్ దీనిపై స్పందించారు. ఎలాంటి సినీనేపథ్యం లేకుండా పరిశ్రమకు వచ్చిన రకుల్.. టాలీవుడ్, బాలీవుడ్‌లలో స్టార్ హీరోల సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. కానీ, తన కెరీర్‌లో నెపోటిజం కారణంగా ఎన్నో అవకాశాలు కోల్పోయినట్లు తాజాగా తెలిపారు. ఏ విషయం గురించైనా నిర్మొహమాటంగా మాట్లాడే రకుల్.. బంధుప్రీతిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'ఇండస్ట్రీలో నెపోటిజం ఉన్నమాట వాస్తవం. నేను దీని కారణంగా అవకాశాలు కోల్పోయాను. అవి నాకు దక్కలేదని బాధ పడలేదు. ఆ సినిమాలు నన్ను ఉద్దేశించినవి కాదని ముందుకుసాగాను. నా తండ్రి సైన్యంలో పనిచేసేవారు. ఆయన సలహాలు, అనుభవం నాకు ఎన్నో నేర్పాయి. చిన్నచిన్న వాటి గురించి ఆలోచించను. అవకాశాలు కోల్పోవడం జీవితంలో ఓ భాగం. నాకు దక్కని వాటి గురించి ఆలోచించి సమయం వృథా చేసుకోను. ఏం చేస్తే నేను వ్యక్తిగతంగా ఎదుగుతానో దానిపై శ్రద్ధ పెడతాను. ఒక స్టార్ కిడ్‌కు లభించినంత సులభంగా మిగతా వారికి ఛాన్స్‌లు రావు. అదంతా వారి తల్లిదండ్రుల కష్టం' అని రకుల్ వివరించారు.ప్రస్తుతం అజయ్‌దేవగణ్ జంటగా రకుల్‌ప్రీత్ సింగ్ 'దే దే ప్యార్ దే 2'లో నటిస్తున్నారు. విజయవంతమైన 'దే దే ప్యార్ దే'కి కొనసాగింపుగా అన్షుల్ శర్మ దీన్ని తెరకెక్కిస్తున్నారు.

Printed & Published and owned by K. Shiva Kumar Goud, Printing at Srinika Printers, Railway Kaman Track, Sony Function Haal Road, Nizamabd.(TS). Editor: K. Shiva Kumar Goud. Registration No. APTEL/1999/00110/, kaburueveningdaily9106@gmail.com